

రేపల్లె మెయిన్ డ్రైయిన్‌లో మందు స్ప్రే చేసి వదిలేసిన దృశ్యం

పనులు చేస్తే.. ఇదేంది?

● రూ.కోటిన్నరతో డ్రైయిన్ల మరమ్మతులు మమ ● మందు స్ప్రే చేసి వదిలేయడంతో ఎండిన గుర్రపుడెక్క

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే వెదనాట్లు ప్రారంభించడంతో పాటు నారుమళ్లు పోస్తున్నారు. అయితే గత ఐదేళ్లలాగే ఈ సారి కూడా సాగునీరు తిప్పలు తప్పవేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సంఘాల రాకతో కాల్వల దుస్థితి మారుతుందని రైతులు ఆశించగా మరమ్మతులు మమ అనిపిస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని కాల్వల మరమ్మతులకు రూ.కోటిన్నర కేటాయించారు. ఆ నిధులు సరిపోవని భట్టిప్రోలు, రేపల్లె, తుంగభద్ర, గుండేరు, అమృతలూరు, కావూరు, గుండ్లపల్లి, మోపర్రు, రేపల్లె ట్రాక్, పర్ర చానల్ డ్రైయిన్లు మరమ్మతుల విషయంలో అసంపూర్తిగా పనులు చేపట్టారు. డ్రైయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు నకు మందు స్ప్రే చేసి వదిలేశారు. దీంతో అది ఎండిపోయి కాల్వల నిండా పేరుకుపోయింది. గుండేరు, జంపని డ్రెయిన్లలో చెత్తాచెదారం పేరుకుని పూర్తిగా మూసుకుపోయా యి. మరికొన్ని చోట్ల గుర్రపు డెక్క నివారణకు కనీసం మందు కూడా స్ప్రే చేసిన దాఖలాలు కూడా లేవు. డెల్టా కాల్వలకు సాగునీరు విడుదల చేసినా కాల్వల దుస్థితి మారకపోవడంతో నీటికి అల్లాడాల్సిందేనని రైతులు వాపోతున్నారు. తుంగభద్ర రైల్వేట్రాక్ పర్రా చానల్, అమృతలూరు, కావూరు, గుండ్లపల్లి, మోపర్రు, ప్రధాన కాల్వలు, బీఎం డ్రైయిన్, రేపల్లె, భట్టిప్రోలు కాల్వల దుస్థితి సక్రమంగా లేని కారణంగా నీరు ముందుకు సాగకపోగా ఎ దురు తన్నే పొలాలను ముంచేస్తుందని దీనివల్ల సాగు విషయంలో సమస్యలు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు.



రేపల్లె మెయిన్ డ్రైయిన్ ఎగువున పేరుకుపోయిన గుర్రపు డెక్క

అసైన్డ్ అక్రమాలు అలాగే..

చర్యలపై అడుగుముందుకు పడితేఒట్టు

వివిధ వేదికలపై దాదాపు 850పైగా ఫిర్యాదులు

ఏడాదిగా విచారణలు, పరిశీలనలతో హడావిడి

ఫ్రీహోల్డ్ భూములపైనా నివేదికలకే పరిమితం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అసైన్డ్ భూముల అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని అసెంబ్లీ వేదికగా కూటమి పాలకులు అట్టహాసంగా ప్రకటించారు. అసైన్డ్ భూముల అవకతవ కలకు సంబంధించి వివిధ వేదికలపై నుంచి దాదాపు 850 ఫిర్యాదులు ప్రభుత్వం వద్దకు చేరాయి. అయితే పరిశీలనలు, నివేదికలు, విచారణల హడావిడితోనే ఏడాది గడిచిందే తప్ప అక్రమార్కులపై తీసుకున్న చర్యలు లేవు. నివేదికల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమి స్తుందని ఆశించిన వారిలో నిరాశ నెలకొంది. నిరుపేద లకు ఇచ్చిన ప్రభుత్వ భూమి కేవలం అనుభవించడానికే తప్ప చేతులు మారడానికి వీలు లేదని అసైన్డ్ చట్టం స్పష్టంగా నిర్వచిస్తోంది. కానీ ఇవేవీ పట్టకుండా కేవలం అగ్రిమెంట్ల ప్రాతిపదికన నిరుపేదల ఆర్థిక అవసరాలు అసరాగా చేసుకుని అసైన్డ్ అక్రమాలు గత ఏలుబడిలో యథేచ్ఛగా జరిగాయి. 2003కు ముందు ప్రభుత్వం దగ్గర నుంచి భూమి పొందిన పేదలకు దానిపై యాజమాన్య హక్కు పొందేలా వైసీపీ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీనిని ఆసరాగా చేసుకుని వేల ఎకరాల అసైన్డ్ భూములను వైసీపీ కీలక నేతాగణంతో పాటు వారి అనుచరులు ఫ్రీ హోల్డ్ చేయించుకున్నారన్న ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున వచ్చాయి. నాలుగు దశాబ్దాల వ్యవధిలో చీరాల, బాపట్ల పరిధిలో దాదాపు 23,000 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు అసైన్డ్ చేసినట్లు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. ఇందులో ప్రస్తుతం 3,000 ఎకరాలు కూడా పేదల దగ్గర లేదని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 6,000 ఎకరాల అసైన్డ్ భూమి చేతులు మారినట్లు తెలుస్తోంది. ఫ్రీహోల్ ముసుగులో వైసీపీ నేతలు అసైన్డ్ అక్రమాలకు తెరలేపారు. ఇదే విషయాన్ని కూటమి ప్రభుత్వం కూడా ధ్రువీకరించింది. జిల్లా వ్యాప్తంగా 3,300 ఎకరాలు ఫ్రీహోల్ చేసినట్లు అధికారులు గుర్తిం చారు. మొత్తం ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 15 శాతం అనర్హులేనని విచారణలో తేలింది. ప్రభుత్వం మారగానే ఫ్రీహోల్డ్ చేసిన భూముల రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేసిం దే. కానీ సదరు అక్రమార్కులపై ఇప్పటికీ చర్యలు దిశగా ఒక్క అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం.



బాపట్ల రూరల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేతులు మారిన అసైన్డ్ భూమి

గత పాలనలో ఎన్నెన్నో వింతలు..

అసైన్డ్ భూమిని కొనడమే చట్టవిరుద్ధమని నిబంధనలు చెబుతుంటే గత ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ కళాశాల నిర్మాణానికి ఓ దాత అసైన్డ్ భూమిని విరాళంగా ఇచ్చారని ఆయనకు ప్రభుత్వ పెద్దలు సన్మానం చేయడం గమనార్హం. నిరుపేదల నుంచి అసైన్డ్ భూమిని కొనుగోలు చేయడమే నేరమైతే దానిని ప్రభుత్వం విరాళంగా తీసుకోవడం మరో విడ్డూరం. ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి బాపట్ల పరిధిలో అసైన్డ్ భూమి పెద్ద ఎత్తున కొనుగోలు చేయడంతో పాటు అక్కడ ప్లాట్లు పంచుకోవడం వైసీపీ ప్రభుత్వంలో మరో అడ్డగోలు అసైన్డ్ దందా. ఇలాంటి లీలలు గత ప్రభుత్వ పాలనలో లెక్కలేనన్ని జరిగాయి. వీటన్నింటిపై ప్రభుత్వం నివేదికలు గతంలోనే తెప్పించుకుంది. కానీ చర్యలేమిటన్నదానికే ఇప్పటికీ సమాధానం లేదు.



కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా పాలన

ఆర్టీసీ బస్సులు ప్రారంభోత్సవంలో మంత్రులు



బస్‌లో ప్రయాణిస్తున్న మంత్రులు, రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్

అద్దంకి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు సూపర్‌లగ్జరీ బస్సులు, శ్రీశైలానికి రెండు, తిరుపతికి ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఆర్టీసీని నిర్వీర్యం చేయడంతో పాటు దివాళా తీయించిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన శాఖల వలే ఆర్టీసీని కూడా గాడిలో పెట్టి అభివృద్ధి పథం వైపు నడిపిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 1470 కొత్త బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నామన్నారు. అద్దంకిలో పాత బస్టాండ్ స్థానంలో నూతనంగా బస్టాండ్ నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టీసీని సామాన్య ప్రజానికానికి చేరువ చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఏడాదిలో అద్దంకి డిపోలో 12 కొత్త బస్సులు ప్రారంభించినట్లు చెప్పారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధికి కృతనిశ్చయంతో ఉందన్నారు. మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి ప్రారంభించిన బస్సులో బంగ్లారోడ్డు వరకు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్, డిప్యూటీ సీటీఎం రవి కాంత్, డీపీటీవో సామ్రాజ్యం, అద్దంకి, బాపట్ల, చీరాల డీఎంలు రామ్మోహనరావు, శ్రీమన్నారాయణ, శ్యామల, అసిస్టెంట్ డీఎం మహబూబీ, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర పాల్గొన్నారు.

వీధులకు త్రివర్ణ వెలుగులు



త్రివర్ణ పతాక రంగు విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన, బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు తదితరులు

బాపట్ల సుందరీకరణకు చర్యలన్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణ ప్రధాన వీధులు త్రివర్ణ పతాక రంగుల వెలుగులతో నింఎ బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన స్తంభాలు ారు. మూడు రంగుల విద్యుత్ దీపాలను ప్రధాన వీధుల్లోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు అమర్చారు. గడియార స్తంభం కూడలిలో ఈ దీపాలను మంగళవారం స్విచ్‌ను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. దీంతో జీబీసీ రోడ్డు, సూర్యలంక రోడ్డు, జమ్ములపాలె రోడ్లు మూడు రంగుల దీపాలు త్రివర్ణ కాంతులు విరజిమ్ముతున్నాయి. బాపట్ల సుందరీకరణలో భాగంగా త్రివర్ణ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైసీపీ పాలకుల వలే కాకుండా దేశభక్తిని చాటేలా త్రివర్ణ రంగులతో దీపాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ సుందరీకరణకు సహకరిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన స్తంభాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు చేపట్టాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో డెంగ్యూ, చికెన్ గూన్యా, మలేరియా వైరల్ ఫీవర్ వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ అమరావతి సచివాలయం నుంచి మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌కు బాపట్ల నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ జ్వరాల కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీరు నిల్వకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన ఔషధాలను నిల్వ చేసుకోవాలన్నారు. నిర్లిప్తంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూమిలో కుళ్లిపోయే వ్యర్థాలను పచ్చకుండీలలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెల్టా, సాగర్ కాల్వలు నుంచి నీరు విడుదల అవుతున్నందున చెరువులను నింపుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీపీవో ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ కటికల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మరో ఐదు అన్న క్యాంటీన్లు!

● ఒక్కోటి రూ.61 లక్షలతో నిర్మాణం ● రూ.3.05 కోట్ల నిధుల విడుదల ● అక్టోబరు 2న ప్రారంభించడమే లక్ష్యం

(కొల్లూరు, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు పేదల కడుపు నింపుతున్నాయి. పట్టణాలకే పరిమితమైన క్యాంటీన్‌లను మండల కేంద్రాలకు ప్రభుత్వం విస్తరిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో ఐదు క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతోంది. ఒక్కొక్క క్యాంటీన్ రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. క్యాంటీన్ భవనాలు, పర్నీచర్ తదితర వసతులకు రూ.3.05 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. అక్టోబరు 2న కొత్త క్యాంటీన్‌లు ప్రారంభించాలని ప్రభుత్వం సంకల్పించింది. పబ్లిక్ హెల్త్ శాఖ పనులు నిర్వహిస్తోంది.

స్థల కేటాయింపు పూర్తి

పల్నాడు జిల్లాలోని అమరావతి, గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, ఫిరంగిపురం, దుగ్గిరాల, బాపట్ల జిల్లాలోని బట్టిప్రోలులో కొత్తగా అన్న క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ఒక్క ఫిరంగిపురం మినహా మిగతా నాలుగు చోట్ల స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. స్థలాలను పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించారు. పట్టణాల్లో ఈ శాఖ ఆధ్వర్యంలోనే క్యాంటీన్‌లను నిర్మించారు. మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పట్టణాల తరహాలోనే ఈ ఐదు చోట్ల క్యాంటీన్‌లు ప్రారంభించి రుచికరమైన భోజనం, అల్పాహారం రూ.5కే పేదలకు అందిస్తారు. రోజుకు రూ.15 చెల్లిస్తే.. మరో 2,500 మంది పేదలకు ఆహారం అందించేందుకు ప్రభుత్వ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

ఒక్కో సొసైటీకి చైర్‌పర్సన్.. ఇద్దరు సభ్యులు

ఎమ్మెల్యేలు పంపిన పేర్లను ఆమోదించిన ప్రభుత్వం

మూడు జిల్లాల్లో 93 సొసైటీల్లో 279 మందికి పదవులు


(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాలుగా త్రిసభ్య కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొన్ని నెలల తరబడి చేస్తున్న కసరత్తు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. గత నెలలో సొసైటీల నిర్వహణ బాధ్యతలను అధికారులకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు లేవని రైతులు నిరాశ చెందారు. పైగా వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన త్రిసభ్య కమిటీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రైతు నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ క్రమంలో సొసైటీల్లో అధికారుల పాలన ఈ నెల 30తో ముగియనున్నది. దీంతో త్రిసభ్య కమిటీల నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పైగా అయా కమిటీల్లో పలువురికి పదవులు దక్కడంతో నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తొలివిడతలో 93 సొసైటీలకు

(మిగతా 6లో)



అన్నవరం సొసైటీ కార్యాలయం



శ్రీశైలం నుంచి సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

◆ శ్రీశైలం నుంచి లక్షన్నర క్యూసెక్కుల నీరు విడుదల
◆ సాగర్ జలశయానికి భారీగా వరద
◆ గణనీయంగా పెరగనున్న నీటి మట్టం
◆ ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలం

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

పర్చూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలను వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది. ప్రాజెక్ట్ నాలుగు గేట్లు తెరచి నాగార్జున సాగర్ జలాశయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం నీటిని విడుదల చేశారు. విద్యుదుత్పత్తి గేట్లు తెరచి దాదాపు లక్షన్నర క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలశయానికి కూడా భారీగా వరద వస్తోంది. దీంతో గణనీయంగా సాగర్‌లో కూడా నీటి నిల్వలు పెరగనున్నాయి. వారం రోజుల్లో 125 టీఎంసీల వరకు నీరు వస్తుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది.

ఆయకట్టు రైతుల్లో ఆనందం

సాగర్‌కు కృష్ణమ్మ సవ్వడితో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. వరద నీరు పోటెత్తుతుండటంతో కుడి కాలువ ఆయకట్టు సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. శ్రీశైలం జలాశయంలోకి 1,73,351 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకు గాను నీటి నిల్వ 195.39 టీఎంసీలకు చేరింది. శ్రీశైలం జలాశయానికి ఇదేస్థాయిలో వరద మూడు రోజులపాటు కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి భారీగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా ఉంది. సాగర్‌లో గతవారం రోజుల్లో 31 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 169 టీఎంసీలకు చేరింది.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తుళ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు జరగనున్నాయన్నాయి. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తుళ్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో.. ఈ నెల 11న ఉదయం యర్రబాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్(యుహెచ్‌సీ)లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటలో పేర్కొంది. రాజధాని అమరావతి పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలిపింది. పూర్తి వివరాలకు సీఆర్డీఏ ఫెసిలిటేటర్ లేదా 79819 25147 నంబరుకు సంప్రదించవచ్చని పేర్కొంది.

నేటి నుంచి డైట్ సెట్.. వెబ్ కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),జూలై 8(ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ అర్హత సాధించిన అభ్యర్థులు బుధవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్న వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ వరకు డైట్ కళాశాలల్లో సర్టిఫికెట్ల పరిశీలన, 25 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో.. ప్రవేశాలకు ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నందివెలుగు రోడ్డులో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీలో 20, సీఈసీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 531.90 అడుగులు ఉంది. ఇది 171.87 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 3090, ఎస్ఎల్‌బీసీ 1500, మొత్తం ఔట్ ఫ్లో 4590 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్ ఫ్లో 1,14,146 క్యూసెకులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 15.21 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పవర్ జనరేషన్ ద్వారా 6,600, లీకుల ద్వారా 400, మొత్తం 7 వేల క్యూసెక్కుల దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

▸▸ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట విశ్రాంత ఉద్యోగుల నిరసన

గుంటూరు (తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు వర్తింపు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధరరావు మంగళవారం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డు, పింఛన్ అమలు చేయాలని కోరారు. ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు కల్పించాలని గత, ప్రస్తుత ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. దండా లక్ష్మీనారాయణ, నిక్లస్, శేషగిరిరావు, నాగేశ్వరరావు, నాంచారయ్య, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రెంటచింతల,జూలై 8 (ఆంధ్రజ్యోతి): అత్త మందలించిందని ఓ వివాహిత ఉరేసుకున్న ఘటన జెట్టిపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. శీలం సంధ్యారాణి(25), సత్యనారాయణ భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. అత్త కోపగించుకోవడంతో సంధ్యారాణి క్షణికావేశంలో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రోశయ్య

▸▸ భూ ఆక్రమణల ఆరోపణపై కమిషనర్ విచారణ ▸▸ ధ్రువపత్రాలతో వచ్చిన బాధితురాలు భారతి




విచారణకు హాజరైన రోశయ్య, కమిషనర్ చాంబర్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తనపై వచ్చిన భూ ఆక్రమణల ఆరోపణలపై గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఎదుట మంగళవారం హాజరయ్యారు. ఆయనతో పాటు ఫిర్యాదుదారురాలు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దారు రాజారావు భార్య గుమ్మడి భారతి కూడా విచారణకు వచ్చారు. గుంటూరు నగరానికి చెందిన గుమ్మడి భారతి మాజీ ఎమ్మెల్యే రోశయ్యపై భూ అక్రమణ ఆరోపణలు చేశారు. నగరంలోని చుట్టుగుంట సెంటర్ నుంచి మిర్చి యార్డుకు వెళ్లే దారిలో సర్వే నంబర్ 178సీ/ ఏ బీ1 లో ఎకరా 23 సెంట్లు భూమిని రాజారావు వద్ద అప్పటి డ్రైవర్‌గా పనిచేస్తున్న కావూరి రాఘవయ్య చౌదరి, నక్కుర్తి పద్మ అనే వారితో కలిసి చల్లా వెంకటరమణతో 1980లో స్వాధీనపు అగ్రిమెంటు చేసుకున్నారు. అప్పట్లోనే పూర్తి నగదు చెల్లించి, ఆ పొలాన్ని స్వాధీనపరచుకొని వాణిజ్య పంటలు పండించారు. భూమిని రిజిస్ట్రేషన్ చేయమని రాజారావు, రాఘవయ్య చౌదరి, పద్మ వెంకటరమణను పలుమార్లు అడిగినా.. దాట వేసుకుంటూ వచ్చారు. 1981లో దాచేపల్లి రామారావు అనే అతను కోర్టులో ఈ భూమిపై డిక్రీ పొందాడు. అయితే రామారావుకి వచ్చిన తీర్పుపై అప్పటికే అగ్రిమెంట్ రాయించుకొని ఉన్న ఫైముగ్గురు కోర్టును ఆశ్రయించగా 1999లో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ ఆస్తిని విక్రయించే హక్కు వెంకటరమణకు లేదని, అగ్రిమెంట్ రాయించుకొని ఉన్న పైముగ్గురికి చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే 1991లో వెంకటరమణ సురేంద్ర కుమార్ వగైరాలకు జీపీఏ చేశాడు. తద్వారా 2002లో మాజీ ఎమ్మెల్యే రోశయ్య తన బినామీలైన జక్కా శ్రీకాంత్, కిలారి రామబ్రహ్మం, శ్రీనివాసరావు వగైరాల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. కోర్టులో దావాలు పెండింగ్‌లో ఉండగా, ఆస్తి అమ్మే హక్కు వెంకటరమణకు లేదని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ.. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. 2015లో హైకోర్టు బాధితురాలు భారతికి అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. 2021లో కేకేఆర్ సినిమా హాలు నిర్మించాలని, దాని వెనుక ఉన్న స్థలాన్ని ఆక్రమించేందుకు మాజీ ఎమ్మెల్యే రోశయ్య ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. తన స్థలంలో దౌర్జన్యంగా ప్రహరీ నిర్మాణం చేపట్టారని, ఈ విషయం తెలిసి మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులకు తెలిజేశామని బాధితురాలు వెల్లడించారు. దీనిపై ఇరు వర్గాలకు నోటీసులు ఇచ్చి, వారి వాదనలను కమిషనర్ విన్నారు. రెండు గంటలపాటు విచారణ కొనసాగింది. ఈ విషయాన్ని కోర్టుల తేల్చుకోవాలని కమిషనర్ చెప్పారని బాధితురాలు గుమ్మడి భారతి పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడేందుకు రోశయ్య సుముఖత వ్యక్తం చేయలేదు. విచారణ అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కార్పొరేషన్‌లో ప్రజా సంఘాల ఆందోళన

బాధితురాలు భారతికి ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే రోశయ్య కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ఆయనను జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

▸▸456 గ్రాముల గంజాయి, ఆటో, మూడు సెల్‌ఫోన్లు సీజ్



నిందితులను చూపుతున్న అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ టూ టౌన్ సీఐ యశోదర దేవి మంగళవారం తెలిపారు. నగరంలోని గుంటూరు వారి తోటకు చెందిన జాఫర్ అహ్మద్, డొంక రోడ్డు కాకుమాను వారి తోటకు చెందిన పెట్లూరి సాహిబ్, బొంగరాల బీడుకి చెందిన దాసరి సుమంత్ అక్రమంగా గంజాయి విక్రయిస్తూ,సేవిస్తూ ఉంటారని తెలిపారు. గత రాత్రి అడవి తక్కెలపాడులోని టిడ్కో ఇళ్ల వద్ద గంజాయి విక్రయిస్తుండగా.. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు వసంత రాయపురంలో మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి 456 గ్రాముల గంజాయి, ఆటో, మూడు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు సీఐ యశోదరా దేవి తెలిపారు. ఎస్ఐ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయంలో రూ.5 లక్షల సొత్తు చోరీ..

నాదెండ్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దేవాలయం గ్రిల్స్ తాళాలు పగల గొట్టి గర్భగుడిలో స్వామి వార్లకు అలంకరించిన మూడు వెండి కిరిటీలు, శంకు చక్రాలను, 24 గ్రాముల బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. హుండీ పగల గొట్టి నగదు చోరీ చేశారు. వీటిన్నంటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. సమాచారం మేరకు.. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు దేవాలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రలను సేకరించింది.

మన్నవను ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది..
నాగమల్లేశ్వరరావు కుటుంబమే

▸▸ మాల కార్పొరేషన్ డైరెక్టర్ బాబూరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు, ఎస్సీ నేతలు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మన్నవను ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది నాగమల్లేశ్వరరావు కుటుంబమేనని పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ నేత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు విమర్శించారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1994లో మొదటిసారి సర్పంచ్‌గా వ్యవహరించిన బొనిగల నాగమల్లేశ్వరరావు హత్యా రాజకీయాలకు పాల్పడుతూ మల్లెల నాగమల్లి హత్యకు కారకులయ్యారని ఆరోపించారు. అలాగే 2000 నుంచి 2006 సంవత్సరం వరకు బొనిగల నాగమల్లేశ్వరరావు తల్లి సూర్య బాపమ్మ సర్పంచ్‌గా ఉండగా రేషన్ డీలర్ దగ్గర 200 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా అమ్ముకొని.. ఆ నేరాన్ని డీలర్ పైకి నెట్టి జైలుపాలు చేశారని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాలు సొంత భవనంగా గ్రామ పంచాయతీ రికార్డు టాంపరింగ్ చేయగా వారిమీద 420 కేసు నమోదయిందని తెలిపారు. నాగమల్లేశ్వరరావు గ్రామ పంచాయతీ నిధులు దిగమింగడంతో అతనిపై 420 కేసు నమోదు చేసి, చెక్ పవర్ రద్దు చేసి సర్పంచ్‌గా కూడా తొలగించారని వివరించారు. నాగమల్లేశ్వరరావు ఈ మదేళ్లలో రూ. 55.6 లక్షల అవినీతికి పాల్పడి ప్రభుత్వ నిధులు దిగమింగారని.. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తే.. అతడు సచ్ఛీలుడని వైసీపీ అగ్ర నాయకులు ఏవిధంగా సమర్థిస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తనపై 30 మందితో దాడి చేసి, చనిపోయాననుకుని వదిలి వెళ్లిపోయారని బండ్లమూడి బాబూరావు గుర్తుచేశారు. మొదటి నుంచి బొనిగల నాగమల్లేశ్వరరావు అవినీతిని ప్రశ్నిస్తున్న తన కుటుంబంపై కక్షగట్టి అందరినీ అంతమొందించాలనే ఉద్దేశంతో గడిచిన ఐదేళ్లలో అనేకసార్లు తనపై దాడి చేశారని, 9 అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. నాగమల్లేశ్వరరావు ఒక అంతర రాష్ట్ర దొంగల ముఠా చరిత్ర కలిగినవాడని.. అంబటి మురళి, అంబటి రాంబాబు, పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు.

జవాన్‌కు ఘన నివాళులు

▸▸ నాగేశ్వరరావుకు కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్థులు
▸▸ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
▸▸ కుటుంబానికి న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పెదనందిపాడు, జూలై, 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జవాన్ నాగేశ్వరరావు మృతదేహానికి గ్రామస్థులు, బంధుమిత్రులు, పోలీసు అధికారులు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. మండల పరిధిలోని వరగానిలో నాగేశ్వరరావు మృతదేహానికి రాజస్థాన్‌లోని బీకనీర్ 177వ మీడియం రెజిమెంట్ సుబేదారులు బీవీ రమణ, రవీంద్రలు పార్థివ దేహంపై జాతీయ జెండా ఉంచి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సమయంలో అక్కడి వైద్య సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించకపోవడం వల్లే తన భర్త, కుమారుడుని కోల్పోయానని నాగేశ్వరరావు భార్య బోరున విలపిస్తూ.. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. తహసీల్దార్ హెనప్రియ, ఎస్ఐ మధు పవన్‌కు.. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నాగేశ్వరరావుతో పాటు కుమారుడు వెంకట్ అభిషేక్ మృతదేహాలకు వరగానిలో శ్మశాన వాటికలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. ఏఆర్ ఎస్ఐ ఏసురాజు ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో జనసేప జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు, ప్రత్తిపాడు సీఐ గన్నవరపు శ్రీనివాసరావు, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మోటార్ స్టార్ట్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ప్రత్తిపాటి శ్రీనివాసరావు (53) అనే వ్యక్తి తెనాలి రోడ్డులోని అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా ఉన్న పొలంలోని.. వరి పంటకు నీరు అందించేందుకు వెళ్లాడు. మోటార్ స్టాటర్‌కు ఉన్న వైర్లను ఎలుకలు కొరికడంతో.. స్టాటర్‌పై ఉన్న రేకుకు విద్యుత్ సరఫరా అయ్యింది. దానిని పక్కకు తొలగించేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన ఇతర రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో.. స్థానికంగా ఉన్న ఓ వైద్యశాలకు తీసుకెళ్లారు. అనంతరం తెనాలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ అమర్‌వర్ధన్ కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

45,606 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,553 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,606 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,406 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9700	11000
334	9500	12700	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	---	----	నెంబరు. 5	10000	13200
341	10000	13400	273	---	---
4884	----	---	341	10000	13500
సూపర్ 10	----	---	4884	10000	12600
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13500	తేజ	10000	13300
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12700	దేవనూరు డీలక్స్	10000	12300
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4700	7000

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

(5వ పేజీ తరువాయి)

కమిటీలను నియమించింది. సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పంపిన పేర్లకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దీంతో ఈ నెల 30నే త్రిసభ్య కమిటీలు సొసైటీల బాధ్యతలు స్వీకరించనున్నాయి. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గాలనే 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. సభ్యుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. దీంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు త్రిసభ్య పాలనకు ప్రభుత్వం మొగ్గు చూపింది.

279 మందికి పదవులు..

ఒక్కో సొసైటీలో చైర్‌పర్సన్‌తో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ ప్రకారం మూడు జిల్లాల పరిధిలో తొలి విడతలో 279 మంది కూటమి నేతలను పదవులు వరించాయి. పల్నాడు జిల్లాలో 36 సొసైటీలకు నామినేటెడ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. గుంటూరు జిల్లా పరిధిలో 7, బాపట్ల జిల్లా పరిధిలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించింది.

నాడు నిర్వీర్యం..

సహకార రంగాన్ని వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. సహకార సంఘాల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యకర్తలను సభ్యులుగా చేర్చారు. దీంతో సొసైటీలు రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార రంగాన్ని ఆ పార్టీ నేతలు ఐదేళ్లు దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రూ.లక్షల్లో స్కాంలు జరిగినట్లు విచారణల్లో వెలుగుచూస్తున్నాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువుల అమ్మకాలను నీరుగార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థికంగా కుదేలైంది. ఇదే పాలనను కూటమి ప్రభుత్వం కూడా అమల్లోకి తీసుకురావడంతో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి.

తీరంలో యువకుడిని రక్షించిన గజ ఈతగాళ్లు



యువకుడిని ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులు

బాపట్లరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో మంగళవారం అలలకు కొట్టుకుపోతున్న యువకుడిని గజ ఈతగాళ్లు రక్షించారు. గుంటూరుకు చెందిన చిలకల భాస్కర్ అనే యువకుడు స్నేహితులతో కలిసి సూర్యలంక తీరానికి వచ్చాడు. సముద్రంలో ఈత కొడుతుండగా.. అలల తాకిడికి భాస్కర్ కొట్టుకుపోయాడు. ఇది గమనించిన గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు అతనిని రక్షించి, ఒడ్డుకు చేర్చారు. ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

మహిళా పోలీసుల..
బదిలీలు లోపభూయిష్టం

▸ ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన



ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా పోలీసులు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణా కార్యదర్శుల (పోలీసు) బదిలీలు లోపభూయిష్టంగా జరిగాయంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. అర్బన్‌లో విధులు నిర్వహిస్తున్న వారిని పల్నాడులోని మారుమూల ప్రాంతాలకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం అధిక సంఖ్యలో మహిళా పోలీసులు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అర్బన్‌లో పనిచేస్తున్న వారిని అర్బన్‌కే కేటాయించాలని కోరారు. ఇప్పటికే పిల్లలను స్కూలు, కాలేజీల్లో చేర్చుకున్నామని.. ఇప్పటికిప్పుడు అంత దూరం వెళ్లాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మరికొందరు చంటి పిల్లలతో ఉన్నారని తెలిపారు. బదిలీలకు ముందే తమ నుంచి ఆప్షన్స్ తీసుకున్నారని, కానీ వాటి ప్రకారం బదిలీలు చేయలేదని మహిళా పోలీసులు వాపోయారు. ఏ ప్రాతిపదికన బదిలీలు నిర్వహించారో కూడా అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయా బదిలీలకు సంబంధించి విధి విధానాలు కూడా రూపొందించలేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి తాము కోరుకున్న ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. సుమారు రెండు గంటలపాటు వారు జిల్లా పోలీస్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. అయితే జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో.. అదనపు ఎస్పీని కలిసేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో బుధవారం మరోసారి పోలీస్ కార్యాలయం ఉన్నతాధికారులను కలవాలని నిర్ణయించుకున్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించం : ఎస్పీ



ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థల సమీపంలో సిగిరెట్లు, పాన్, గుట్కా, గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించమని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల సిబ్బంది ఆపరేషన్ సేఫ్ క్యాంప్ జోన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల సమీపంలోని దుకాణాలు, బడ్డీకొట్టులలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఈగల్ చీఫ్ ఆర్.రవికృష్ణ సూచనల మేరకు ఈగల్‌సెల్ సిబ్బంది కూడా ఈ తనిఖీలలో పాల్గొన్నారు. తనిఖీలు అనంతరం పోలీసు అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించి పొగాకు ఉత్పత్తులు వలన కలిగే అనర్థాలు గురించి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థలకు 100మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలలో పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదనే నిబంధన ఉందన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాలను సంబంధిత పోలీసు అధికారులు తనిఖీ చేయటం జరిగిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. ఎక్కడైన పొగాకు ఉత్పత్తుల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా టోల్‌ఫ్రీనెంబరు 19172కు కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కొల్లూరులో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమం

కొల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాన్ని ఎస్ఐ అమర్‌వర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కొల్లూరులోని జీవీఎస్ఆర్ జూనియర్ కళాశాలకు 100 మీటర్ల దూరంలో ఏ షాపులలో కూడా సిగరెట్లు, పాన్ గుట్కా, గంజాయి, పొగాకు ఉత్పత్తులకు సంబంధించినవి అమ్మకూడదన్నారు. ఆయా షాపులను పరిశీలించి షాపు యజమానులకు వాటిపై అవగాహన కల్పించారు. ఎవరైనా ప్రోత్సహించిన యెడల వారి వివరాలు తెలియజేయాలన్నారు. విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుని షాపును సీజ్ చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యర్థాలు వేరు చేయకుంటే సేకరించవద్దు : కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గృహాల నుంచి ప్రతిరోజు సేకరించే తడి, పొడి చెత్తను, హానికర వ్యర్థాలను వేరు చేసి ఇస్తేనే తీసుకోవాలని పారిశుధ్య కార్మికులకు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్యం, పర్యావరణ కార్యదర్శులతో ఆయన సమావేశం అయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గృహ యజమానుల వద్ద నుంచి వేరు చేసిన వ్యర్థాలనే సేకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ డీఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, ఆర్వో అబ్దుల్ జబ్బార్, మేనేజర్ లక్ష్మయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ పాల్గొన్నారు.

● హోం కంపోస్ట్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి మెప్మా సిబ్బందికి తెలియజేశారు. ఈవిషయమై మంగళవారం మెప్మా ఆర్పీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని గృహాలను సందర్శించి చెత్త వేరు చేసే విధానం గురించి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పీఎమ్ సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ సర్వే పురోగతిపై మాట్లాడారు. సమావేశంలో సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, సీవోలు బండి విజయలక్ష్మి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతిపై అధికారులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి సూచిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండల లెవెల్ ఆఫీసర్స్, డీఏలు, అసిస్టెంట్ ఇంజనీర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. 17 పంచాయతీల పరిధిలోని 17 ప్రభుత్వ శాఖల పనితీరుపై గణాంక వివరాలు సేకరించి దానికి సంబంధించిన వాటి మీద శిక్షణ ఇవ్వటం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో 18వ తేదీన గ్రామసభ జరుగుతుందని తెలిపారు.

పిట్టలవానిపాలెంలో...



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

పిట్టలవానిపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి, డివిజనల్ అభివృద్ధి అధికారి సీహెచ్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాలలోని అన్ని సచివాలయాలలో డిజిటల్ ఇంజనీరింగ్ ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ పురోగతిపై చేపట్టాల్సిన అంశాలపై కార్యదర్శులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీరింగ్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, సురేష్, ఏపీవో, ఏపీఎంలు గణపతి, చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాగ్యరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.రాధ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

● మాజీ ఎమ్మెల్యే కోన



డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కోన రఘుపతి

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైఎస్ జయంతిని మంగళవారం పట్టణంలోని మూర్తిరక్షణ్‌నగర్, దగ్గుమల్లివారిపాలెం, వెంగళ్‌విహార్, కర్లపాలెం రోడ్డులోని ఆయన విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మూర్తి రక్షణ్‌నగర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాండురంగాపురంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కోన రఘుపతితో పాటు వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, సీనియర్ నాయకుడు చేజర్ల నారాయణరెడ్డి, యువజన విభాగం నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గంటా అంజిబాబు ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు కర్లపాలెం రోడ్డులోని వైఎస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి ఆదుకున్న వ్యక్తి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డేనని రేపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ ఈవూరిగణేష్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో, బస్టాండ్ సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేశారు. చెరుకుపల్లిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా కేక్‌కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు.

● వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం వైసీపీ శ్రేణులు మండల పరిధి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దానియేలు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్‌లో ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వైసీపీ కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ సీతారామరాజుతో కలిసి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కష్టపడి పని చేసేవారికి పార్టీలో గుర్తింపు

● ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం టీడీపీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే ఆనందబాబు, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి హాజరై మండల కమిటీ నియామకంపై చర్చించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాలలోని నాయకులు, కార్యకర్తలు నుంచి అభిప్రాయాలను సేకరించారు. ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశం నిర్వహించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మండల కమిటీతో పాటు అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల నియమకాలు కూడా చేస్తున్నట్లు ఎమ్మెల్యే సమావేశంలో వెల్లడించారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మండల కమిటీ నియామకాన్ని పూర్తి చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను మాత్రం త్వరలో ప్రకటిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా సనకా పాపారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మొలబంటి రామారావు, కనపర్తి భువనేశ్వరరావు, పీతా నాగరాజు, కార్యదర్శులుగా సుంకర శ్రీనివాసరావు, కొలుసు జనార్ధన్, తుపాకుల ఈశ్వరమ్మ, కోశాధికారిగా పబ్బిశెట్టి సత్యకుమార్, అనుబంధ విభాగాల అధ్యక్షులుగా తెలుగు యువత శీలం అంకమ్మరావు, తెలుగు రైతు నాగళ్ల రాంబాబు, ఎస్సీ సెల్ పెద్దపల్లి రాంబాబు, బీసీ సెల్ పడమటి శివశంకరరావు, తెలుగు మహిళ దొడ్డపనేని సంపూర్ణ, ఎస్‌టి సెల్ గరిక అనంత భోగేశ్వరస్వామి, మైనారిటీ సెల్ షేక్ బాజీలను ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన వారందరిని ఎమ్మెల్యే అభినందించారు. పార్టీ బలోపేతానికి కమిటీ సభ్యులు కృషి చేసే విధంగా దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ : కలెక్టర్

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జర్నలిస్ట్ కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. జిల్లాలో అక్రిడిటేషన్ కార్డు పొందిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులకు సదరు ఉత్తర్వులను పంపించారు. కలెక్టర్ జె.వెంకటమురళి తీసుకున్న ఈ నిర్ణయంపై ఏపీయూడబ్ల్యూజే, బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత 15 రోజులుగా చేస్తున్న ఆందోళనలో భాగంగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు కె.శరత్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రత్నం, నాని, అశోక్, మురళి కృష్ణ, హరిబాబు, సాంబిరెడ్డి, ప్రమీల, నరేష్ పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు తీసుకోవాలి : ఏడీఏ

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సాగు చేసే కౌలు రైతులు తప్పనిసరిగా కార్డులు తీసుకోవాలని వాటి ఆధారంగా కౌలు రైతు రుణం మంజూరు చేయటం జరుగుతుందని ఏడీఏ కె.ధనరాజు తెలిపారు. మండలంలోని కంకటపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయాధికారిణి కె.శారద అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ఏడీఏ ధనరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వరి రైతులు ఎకరానికి రూ.800 చెల్లించి పంట ఇన్సూరెన్స్ చేయించుకుంటే పంట నష్టపోయినప్పుడు ఎకరానికి రూ.40 వేలు ఇన్సూరెన్స్ కంపెనీ వారు చెల్లించటం జరుగుతుందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి పంట నమోదు ప్రక్రియ మొదలౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది విజయశ్రీ, రైతులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెంలో...

పిట్టలవానిపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా డీఆర్సీ ఏవో సరళ విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు తప్పనిసరిగా విత్తనాలను సర్టిఫై చేసిన డీలర్ వద్దనే కొనుగోలు చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ మాట్లాడుతూ రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగుమందులు అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు కె.ప్రశాంతి, సీహెచ్ సుదర్శనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.రాజకుమార్, వి.శివనాగేశ్వరమ్మ, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బావూజీపాలెం గ్రామంలో...

నిజాంపట్నం (రేపల్లె), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమా పథకాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయరాజు అన్నారు. బావూజీపాలెం గ్రామంలో వరి నారు పెంచే పద్ధతి గురించి మంగళవారం ఆయన వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వరి నారుమడులు తయారీ పోషక లోపాల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏసీ హెచ్ సుస్మిత, రైతులు పాల్గొన్నారు.

25మంది విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తా

● లయోల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విన్నకోట



మాట్లాడుతున్న విన్నకోట సాంబశివరావు

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పీ4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టిన కలెక్టర్ జె.వెంకటమురళి స్ఫూర్తితో తన స్కూలులో 25 మంది విద్యార్థులకు ఉచిత విద్యనందించాలని నిర్ణయించినట్లు లయోల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విన్నకోట సాంబశివరావు తెలిపారు. ఈవిషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ చదువుకోవాలనే ఆసక్తి కలిగిన వారు, ఆర్థిక స్థోమత లేని పేద పిల్లలకు అధికారుల సిఫార్సు మేరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 25 మందికి ఉచిత విద్యనందించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మొదటి ప్రాధాన్యతనివ్వటం జరుగుతుందన్నారు. తండ్రి ఉండి తల్లి లేని వారికి, తల్లి ఉండి తండ్రి లేని వారికి కూడా ఉచిత విద్యనందిస్తానని తెలిపారు. పాత్రికేయుల పిల్లలకు కూడా ఇందులో అవకాశం కల్పిస్తానని చెప్పారు.

పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఎంపీడీవో

కర్లపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గోడౌన్ నుంచి ముక్క పురుగులు రావడం వల్ల ఎం.వి.రాజుపాలెం, నల్లమోతువారిపాలెం, సత్యవతిపేట గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆదేశించారు. కర్లపాలెం-బాపట్ల రోడ్డులో జాతీయ రహదారి పక్కన ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్‌లో నిల్వ ఉన్న బియ్యాన్ని ఎంపీడీవో అద్దూరి శ్రీనివారావు, ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ముక్కపురుగులు బయటకు రాకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన గోడౌన్ యాజమాన్యానికి తెలియజేశారు.

వైభవంగా సాయిమందిర వార్షికోత్సవం



పెనుమర్రులో షిరిడిసాయిబాబాకు పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుమర్రు గ్రామంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తి ప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం కాకడ హారతి సమర్పించి నగర సంకీర్తన నిర్వహించారు. పంచసూక్తాలతో స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపిన అనంతరం పట్టు వస్త్రాలు సమర్పించి గజమాలతో అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వారి గోత్రనామాలతో పూజలు జరిపించారు. భక్త సమాజాల వారు సాయి నామ సంకీర్తన గావించారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం విశేష భజన, గ్రామంలో పల్లకి ఉత్సవం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

17 శాఖల అనుసంధానంతో పంచాయతీల యాక్షన్ ప్లాన్

● ఎంపీడీవో రవికుమార్

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల యాక్షన్ ప్లాన్‌ను 17 శాఖల అనుసంధానంతో నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. రోశయ్య మీటింగ్ హాలులో పంచాయితీ పురోగతి సూచిక పీడీఐ వర్షన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాక్షన్ ప్లాన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి అంశంపైన గ్రామ సభల ద్వారా ఆమోదాన్ని పొందాలన్నారు. ట్రైనర్ షేక్ సాదిక్ ఆలీ, డిజిటల్ అసిస్టెంట్ తిరుపతిరావు యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కలిగే విధంగా వివరాలను తెలిపారు. సమావేశంలో 17 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, 14 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌సాగర్ తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేమూరులో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, సొంత భూమి గల రైతులు అన్నదాత సుఖీభవ అర్హత కలిగి ఉన్నారో లేదో తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా కౌలు రైతు కార్డు పొందే రైతులు అన్నదాత సుఖీభవ పొందేందుకు గ్రీవెన్స్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగు విత్తే వెద పద్ధతి విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అమృతలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ అసిస్టెంట్, పీఏఐపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఏ ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని, ఆయా అంశాలపై వివరించారు. శిక్షకులుగా బి.మురళీకృష్ణ, కే.వీరేంద్ర, ఎం ఫణికుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నరేంద్రరెడ్డి, ఎంఈవో-2 కె.రమేష్‌బాబు, ఏవో మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమూరు, చావలి, పోతుమర్రు, బూతుమల్లి గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం పర్యటించింది. ప్రభుత్వ కార్యాలయాలు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, చర్చిలు, దేవాలయాలు, నివాస గృహాల పరిసర ప్రాంతాలు సందర్శించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యం, టాయిలెట్ల పరిశుభ్రత మొదలైన అంశాలపై ఇంటింటికి వెళ్లి విచారించారు. టీం సభ్యులు సందీప్, ఈవోపీఆర్డీ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిర్మల, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎస్‌డబ్ల్యూఎం కన్సల్టెంట్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



పోతుమర్రు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

రోడ్డు ప్రమాదంలో చేపల వ్యాన్ బోల్తా

బాపట్లరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పిన్నిబోయినవారిపాలెం హైవే మీద చేపల లోడ్‌తో వెళుతున్న బొలేరో వాహనం మంగళవారం బోల్తాపడింది. వివరాల్లోకి వెళితే కర్లపాలెం నుంచి చెన్నైకి వెళుతున్న సిఫుడ్ బొలేర వాహనం బాపట్ల మండలం పిన్నిబోయనవారిపాలెం సమీపంలోని హైవే రహదారిపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో అదుపు తప్పి బొలేరు వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం లేదు. చేపలు రోడ్డ మీద చెల్లాచెదురుగా పడిపోయాయి.

అదుపు తప్పి కార్లు ఢీ : వ్యక్తికి గాయాలు

బాపట్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్లకు చెందిన వైద్యులు మెండాల వెంకటేశ్వర్లు కారులో గుంటూరు వెళుతుండగా అప్పికట్ల సమీపంలో ఎదురుగా కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మెండాల వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి.

సమస్యలుంటే చెప్పండి...

● సుపరిపాలన తొలి అడుగులో ప్రజలకు ఎమ్మెల్యే సూచన



కొల్లూరు గౌడపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్య తదితరులు

కొల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సమస్యలుంటే చెప్పండి తీరుస్తానంటూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రజలకు సూచించారు. కొల్లూరులోని గౌడపాలెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, వేమూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి గంగాధర్‌లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, కోగంటి హరి, జీఎల్‌జీ భగవాన్, వేములపల్లి మోహనకృష్ణ, మేకా దివాకర్, మల్లంపాటి హరి, యార్డు డైరెక్టర్ కుటుంబరావు, బీజేపీ నాయకులు గోగినేని చంద్రం, జనసేన నాయకులు బొందలపాటి చలమయ్య, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్న ముమ్మనేని



మైనేని మురళీకృష్ణతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్య

కొల్లూరులో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని అక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ముచ్చటించారు. వృద్ధాప్యంలో (81 ఏళ్ల వయసు) కూడా వయోభారంతో శరీరం సహకరించకున్నప్పటికీ పార్టీ పట్ల అంకితభావంతో క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను అందరూ స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న గూడపాటి శ్రీనివాసరావు

రేపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భావి తరాల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 2, 10వ వార్డులలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ఇంటింటికి తిరుగుతూ సంవత్సరకాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలను అందించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం, తల్లికివందనం కింద ఒకే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.13 వేలు చొప్పున అందిస్తున్నామన్నారు. అన్న క్యాంటిన్‌లు ప్రారంభించి ప్రజల ఆకలిని తీర్చామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, పంతాని సాయికుమార్, గూడవల్లి బాబూరావు, షేక్ జమీర్, ఆలూరి డానియేలు, దేవగిరి రవి, కేసన నరసింహ, కరిముల్లా, వెంకటేశ్వరరావు, బాలాజీ, బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు



వేమూరులో నిమ్మమొక్కలు నాటుతున్న విజయబాబు తదితరులు

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల రైతులకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల లబ్ధిదారులు ఒకే రోజున మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ఏపీవో సత్యకృష్ణ పర్యవేక్షణలో మంగళవారం మండలంలోని రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయబాబు వేమూరులోని లబ్ధిదారుడు పాలడుగు శివశంకర్‌కు చెందిన తోటలో నిమ్మమొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యానవన శాఖ ప్రత్యేకంగా అందించే ప్రోత్సాహకాలను ఉపాధి నిధుల ద్వారా కూడా అందజేయడం విశేషమన్నారు. ఏపీడీ సువార్త మాట్లాడుతూ, ఉద్యానవన పంటలు వేసుకునే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా సహకరించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఏపీవో మాట్లాడుతూ, మండలంలోని వేమూరు గ్రామంలో ఇద్దరు రైతులకు, జంపని గ్రామంలోని ఇద్దరు రైతులకు నాలుగు ఎకరాల 80 సెంట్లలో నిమ్మతోటల పెంపకానికి ప్రోత్సాహక ఆమోదం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, టీఎఫ్‌టీ అవంతి, ఫీల్డ్ అసిస్టెంట్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు సొసైటీలకు నూతన పాలకవర్గం



ఊసా రాజేష్



నాగకుమార్



ఉక్కుర్తి నాగేశ్వరరావు

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమూరు, వరహాపురం, పెరవలి వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం నూతన పాలకవర్గాలను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వేమూరు సంఘం అధ్యక్షునిగా నియోజకవర్గ జనసేన సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న ఊసా రాజేష్, డైరెక్టర్లుగా గంటా శ్రీనివాసరావు, గవిని లక్ష్మీదుర్గలను నియమించింది. వరహాపురం సొసైటీ అధ్యక్షుడిగా టీడీపీకి చెందిన బొల్లిముంత నాగకుమార్‌ను, పచ్చిగళ్ల సత్యవతి, బొల్లిముంత విజయలక్ష్మిలను డైరెక్టర్లుగా నియమించింది. పెరవలి సొసైటీ అధ్యక్షుడిగా టీడీపీకి చెందిన ఉక్కుర్తి నాగేశ్వరరావును, అధ్యక్షుడిగా శౌంరి వీరవసంతరావు, చవ్వాకుల పాములను డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే ఆనందబాబుకు నూతనంగా నియమితులైన అధ్యక్షులు, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

అమృతలూరు మండల పరిధిలో...

అమృతలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 5 సహకార ప్రాథమిక సంఘాలకు ప్రభుత్వం నూతన త్రిసభ్య కమిటీలను నియమించింది. అమృతలూరు ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్‌గా క్రొత్తపల్లి రవీంద్రబాబు, సభ్యులుగా తొలు బాలకృష్ణ, వేల్పూరి రామస్వామి, కూచిపూడి సంఘంనకు ఛైర్మన్‌గా తుమ్మల భుజంగరావు, సభ్యులుగా రావి రణదేవ్, బొంతా వీరాంజనేయులు, పెదపూడి సంఘం ఛైర్మన్‌గా కొసరాజు దేవకుమార్, సభ్యులు గా తెనాలి వీరయ్య, జూటూరి తిరుపతిరావు, బోడపాడు సంఘం ఛైర్మన్‌గా కొడాలి గోపాలకృష్ణ, సభ్యులుగా అచ్చన వెంకటేశ్వరరావు, కొర్రపాటి విశ్వేశ్వర దుర్గా హరిప్రసాద్, ఇంటూరు సంఘం ఛైర్మన్‌గా కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్, సభ్యులుగా షేక్ కాలేషావలి, మోతుకూరి భానుప్రసాద్‌లను నియమించారు. తమ నియామకం చేసిన వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



రేషన్ డిపో వద్ద క్యూఆర్ కోడ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సమస్యకు.. స్కాన్

- రేషన్ ఫిర్యాదులకు క్యూఆర్ కోడ్
- దుకాణాల వద్ద పోస్టర్లు ఏర్పాటు

సత్తెనపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు.. డీలర్ల మోసాలపై ఫిర్యాదులకు.. కార్డుదారుల సమస్యలు పరిష్కరించేందుకు.. ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. రేషన్ దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకుంది. ఈ పోస్టర్ల లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సమస్యలను, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కార్డు దారులకు అవకాశం కల్పించింది. రేషన్ సరుకుల సరఫరాను మరింత పారదర్శకంగా చేపట్టేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తుంది. ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ డిపోల ద్వారా సరుకులను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సరుకుల పంపిణీలోని సమస్యలు, అభ్యంతరాలపై ఫిర్యాదు చేసేందుకు కార్డుదారులు ఇబ్బంది పడకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గతంలోలా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిపో వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి క్షణాల్లోనే ఫిర్యాదు చేసే అవకాశం కార్డుదారులకు కల్పించింది.

క్యూఆర్ కోడ్ ఇలా..

డిపోల వద్ద ప్రదర్శిస్తున్న క్యూఆర్ కోడ్‌తో కార్డుదారులకు అనేక ఉపయోగాలు ఉన్నాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఈ నెల సరుకులు తీసుకున్నారా?, సరుకుల నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా? డీలర్ సరైన తూకంలో సరుకులు ఇచ్చారా?, అధిక ధరలు వసూలు చేశారా? డీలర్ మీతో మర్యాదపూర్వకంగా వ్యవహరించారా?, సమయ పాలన పాటిస్తున్నారా? అనే ప్రశ్నలతో వెబ్ పేజీ వస్తుంది. ఆయా ప్రశ్నలకు సమాధానం ఇస్తే కార్డుదారుల ఫిర్యాదులు, అభిప్రాయాలు నేరుగా సంబంధిత ఉన్నతాధికారులకు చేరుతాయి. వాటిని పరిశీలించిన అధికారులు సత్వరం పరిష్కరిస్తారు.

అక్రమాల నివారణకే..

రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాల నివారణకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఉపకరిస్తుంది. సరుకుల పంపిణీలో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తే క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. క్యూఆర్‌కోడ్ స్కానర్ల ఫ్లెక్సీలను ప్రతీ రేషన్ డిపో వద్ద ప్రదర్శిస్తున్నాం.

-రవికుమార్, సీఎస్‌డీటీ సత్తెనపల్లి


రేషన్ షాపు వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ

ఆల్ ఇన్ వన్.. రైల్‌వన్!

- రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్ బుకింగ్ సదుపాయం
- పీఎన్‌ఆర్ స్థితి, కోచ్ పొజిషన్ వంటి సర్వీసులెన్నో..
- ఫుడ్ కూడా ఆర్డర్ చేసే అవకాశం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ అందిస్తున్న వివిధ రకాల సేవలన్నీ ఒకే యాప్‌లోకి తీసుకొచ్చింది. అన్ని సర్వీసులను రైల్‌వన్ మొబైల్ అప్లికేషన్‌లో అందుబాటులో ఉంచింది. దీంతో వేల సంఖ్యలో వినియోగదారులు ఈ యాప్ ద్వారా రైల్వే సేవలు పొందడం ప్రారంభించారు. రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్లతో సహా అనేక సర్వీసులు ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల అరచేతిలోకి వచ్చేశాయి. దీంతో రైల్వేస్టేషన్లు, పీఆర్ఎస్ కౌంటర్ల వద్దకు వెళ్లకుండానే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొని ప్రయాణిస్తున్నారు. అంతేకాకుండా ట్రాక్ యువర్ ట్రైన్ వంటి సేవలు కూడా పొందగలుగుతున్నారు.

రైల్‌వన్ యాప్‌ని రైల్వే శాఖ గత వారమే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో మొబైల్ నంబరు ద్వారా రిజిష్టర్ చేసుకోవచ్చు. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్టు, యూటీఎస్ యాప్‌ల యూజర్లు కూడా.. వాటి ద్వారా రిజిస్టర్ కావొచ్చు. కొంత సమయానికే ఈ యాప్ అవసరం అనుకొనే వాళ్లు గెస్టుగా కూడా లాగిన్ కావడానికి అవకాశం ఉంది. లాగిన్ అయ్యాక హోం పేజీలోనే అన్ని సేవలు కనిపిస్తాయి. వినియోగదారుడు వాటిల్లో ఏ సర్వీసు కావాలంటే దానిని బుక్ చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్ ద్వారా రైల్‌వన్‌లో రిజిస్టర్ అయితే ఆర్ వ్యాలెట్ యాక్సెస్ కావొచ్చు.

అన్ రిజర్వుడ్ టిక్కెట్లపై 3 శాతం రాయితీ

రైల్‌వన్ యాప్‌ని వినియోగించి అన్ రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్లను బుకింగ్ చేసుకొంటే రైల్వే శాఖ ప్రత్యేక రాయితీ కల్పిస్తోంది. మూడు శాతం క్యాష్‌బ్యాక్‌గా ఆర్ వ్యాలెట్‌లో జమ చేస్తుంది. దీని వల్ల రూ. 100 విలువ చేసే టిక్కెట్ బుకింగ్ చేసుకొంటే రూ.3 ఆర్ వ్యాలెట్‌లోకి వస్తాయి. అన్ రిజర్వుడ్ ఈ-టిక్కెట్ ద్వారా రైళ్లు, సీజన్ టిక్కెట్ తీసుకోవచ్చు. స్టేషన్‌కు దూరంలో నుంచి కూడా బుకింగ్ చేసుకోవచ్చు. అలానే స్టేషన్‌లో ఉన్నా ఈ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి టిక్కెట్ బుకింగ్ చేసుకో వచ్చు. సీజన్ టిక్కెట్ రెన్యువల్ చేసుకొనే సదుపాయం కూడా ఉంది. రైలు ఎక్కే స్టేషన్, దిగిపోయే స్టేషన్ పేర్లు నమోదు చేయగానే ఏ ఏ మార్గాల్లో ప్రయాణించదలిచారో కనిపిస్తాయి. వాటిల్లో ఒకదానిని ఎంపిక చేసి బుకింగ్ చేసుకోవచ్చు. గరిష్ఠంగా నలుగురు ప్రయాణికులకు ఒక అన్‌రిజర్వుడ్ ఈ-టిక్కెట్ బుకింగ్ చేయొచ్చు. ఆర్‌వ్యాలెట్, యూపీఐ, క్రెడిట్/డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా నగదుని చెల్లించే అవకాశం ఉంది.



రైల్‌వన్ యాప్

సులభతరంగా రిజర్వుడు టికెట్లు

స్లీపర్, సెకండ్ సిట్టింగ్, త్రీటైర్, త్రీటైర్ ఎకానమి, సెకండ్ ఏసీ, ఫస్టు ఏసీ, చైర్‌కార్ బోగీల్లో టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చు. అలానే కనెక్టింగ్ జర్నీ, రైల్వేపాస్ రాయితీ, దివ్యాంగుల రాయితీ టిక్కెట్‌లను కూడా బుకింగ్ చేసుకొనే సదుపాయం ఉంది. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్టు యాప్‌లో వలే ఆటో అప్‌గ్రేడేషన్, కోచ్ నంబరు ప్రాధాన్యం, రిజర్వేషన్ ఛాయిస్ వంటివి ఎంపిక చేసుకోవచ్చు. మాస్టరు లిస్టుని కూడా తయారు చేసుకొని అందులో నుంచి ఎవరి పేర్లతో టిక్కెట్ బుకింగ్ చేసుకోవాలనేది నిర్ణయించుకొని సింగిల్ క్లిక్‌తోనే ప్యాసింజర్లను జత చేయవచ్చు. ప్లాట్‌ఫాం టిక్కెట్‌లను స్టేషన్ వెలుపల, స్టేషన్ లోపల నుంచి కూడా బుకింగ్ చేయొచ్చు.

మరికొన్ని సేవలు ఇలా...

ట్రైన్ నంబరు, పేరు నమోదు చేసి దాని షెడ్యూల్‌ని సెర్చ్ ట్రైన్ ఆప్షన్‌ని క్లిక్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చు. అలానే రైలు ఎక్కే స్టేషన్, దిగాల్సిన స్టేషన్ పేర్లను నమోదు చేసి ఏఏ రైళ్లు ఆ మార్గంలో ఉన్నాయో శోధించొచ్చు. రన్నింగ్‌లో ఉన్న రైళ్ల వివరాలు పొందవచ్చు. రాబోయే 2 గంటల నుంచి 8 గంటల మధ్యన ఆ మార్గంలో ఏ రైళ్లు ఉన్నాయనేది కూడా తెలుసుకొనే అవకాశం ఉంది.

- రిజర్వేషన్ టిక్కెట్ పీఎన్ఆర్ స్థితిని తెలుసుకోవడానికి సులభతరమైన ఆప్షన్ ఇచ్చారు. పీఎన్‌ఆర్ నంబరుని నమోదు చేసి షో స్టేటస్‌ని క్లిక్ చేయగానే టిక్కెట్ కన్‌ఫర్మ్ అయిందా, ఇంకా వెయిట్ లిస్టులోనే ఉందా, అప్‌గ్రేడ్ అయితే ఏ తరగతి బోగీలోకి అప్‌గ్రేడ్ అయిందనే వివరాలు తెలుసుకోవచ్చు.
- ఇటీవల కాలంలో కోచ్ ఇండికేషన్ బోర్డులు సక్రమంగా పని చేయకపోతుండటంతో ఏ బోగి ఎక్కడికి వచ్చి ఆగుతుందనేది తెలియక ప్రయాణికులు ఆదుర్దా పడుతున్నారు. దీనికి పరిష్కారంగా కోచ్ పొజిషన్ తెలుసుకొనే అవకాశం కూడా రైల్‌వన్ యాప్ కల్పిస్తుంది. ట్రైన్ నంబరు, పేరు, స్టేషన్, ప్రయాణ తేదీని ఎంపిక చేసి షో కోచ్ పొజిషన్ క్లిక్ చేస్తే ఇట్టే ఆ వివరాలు తెలిసిపోతాయి.
- ట్రాక్ యువర్ ట్రైన్ ఆప్షన్ ద్వారా రైలుని రియల్ టైంలో ట్రాకింగ్ చేయొచ్చు. రైలు నంబరు, స్టేషన్ నమోదు చేస్తే ఎన్ని గంటలకు వస్తుంది, ప్రస్తుతం ఏ స్టేషన్ దాటింది, తర్వాతి స్టేషన్ పేరు, కరెంట్ మూవ్‌మెంట్, కోచ్ పొజిషన్ తెలిసిపోతుంది.
- ప్రయాణంలోనే ఫుడ్ ఆర్డర్ చేసుకోవడానికి కూడా రైల్‌వన్ యాప్‌లో అవకాశం కల్పించారు. పీఎన్‌ఆర్ నంబరు ఎంటర్ చేసి సెర్చ్ చేయగానే వివిధ రకాల ఫుడ్ ఐటెంలు కనిపిస్తాయి. వాటిని ఎంపిక చేసి ఆర్డర్ చేయగానే ఫుడ్ షెడ్యూల్ సమయానికి బెర్తు వద్దకు తీసుకొచ్చి అందజేస్తారు.
- రద్దు చేసుకొన్న టిక్కెట్‌లు, ప్రయాణం చేయని వాటికి నిబంధనల ప్రకారం రీఫండ్ ఫైల్ చేయొచ్చు.
- రైల్ మదద్ ఆప్షన్ ద్వారా ప్రయాణ సమయంలో సమస్యకు సంబంధించిన ఫొటో, వీడియో, ఆడియోని జత చేసి నివేదిస్తే.. ఆన్‌బోర్డు సిబ్బంది హాజరై సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటారు.
- ప్రయాణ సమయంలో ఎదుర్కొన్న అనుభూతిని ట్రావెల్ ఫీడ్‌బ్యాక్ ఆప్షన్ ద్వారా తెలియజేసే అవకాశం ఉంది.

ఇక సూపర్ ఫాస్ట్‌గా 'శబరి'

- ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్
- రైల్వేబోర్డు ఆమోదం, మారనున్న కాలమానం
- కొద్ది రోజుల్లోనే అమలులోకి

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా సికింద్రాబాద్ - తిరువనంతపురం మధ్యన రాకపోకలు సాగించే శబరి ఎక్స్‌ప్రెస్ కొద్ది రోజుల్లోనే సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనని రైల్వేబోర్డు మంగళవారం ఆమోదించింది. దీని వల్ల ఈ రైలు కాలమాన పట్టికలోనూ మార్పులు జరగబోతున్నాయి. ప్రస్తుతం 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ నిత్యం ఉదయం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 4.39 గంటలకు చీరాల, 4.54కి బాపట్ల, 5.13కి నిడుబ్రోలు, 5.53కి తెనాలి, ఉదయం 6.29కి గుంటూరు, 7.10కి సత్తెనపల్లి, 7.40కి పిడుగురాళ్ల, 8.07కి నడికుడి, మధ్యాహ్నం 12.45కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత.. బోర్డు అనుమతించిన తేదీ నుంచి ఈ రైలు 20630 నంబరుగా ఉదయం 6.45 గంటలకు తిరువనంతపురంలో బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్లకు సుమారుగా గంట ముందే ప్లాట్‌ఫాం వద్దకు వస్తుంది. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. తద్వారా ఈ రైలు గంటా 45 నిమిషాల ప్రయాణ వేగం పెరుగుతుంది.

ఇదే విధంగా.. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ నిత్యం మధ్యాహ్నం 12.20 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.54కి నడికుడి, 3.14కి పిడుగురాళ్ల, 3.40కి సత్తెనపల్లి, సాయంత్రం 4.59కి గుంటూరు, 5.44కి తెనాలి, 6.04కి నిడుబ్రోలు, 6.24కి బాపట్ల, 6.39కి చీరాల, మరుసటి రోజు సాయంత్రం 6.05కి తిరువనంతపురం చేరుతుంది. బోర్డు అనుమతించిన తేదీ నుంచి ఈ రైలు 20629 నంబరుగా మధ్యాహ్నం 2.35కి సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. అంటే దాదాపుగా ప్రస్తుతం ప్రయాణిస్తున్న కాలమానపట్టిక కంటే రెండు గంటల ఆలస్యంగా పైన పేర్కొన్న స్టేషన్లకు చేరుకొని మరుసటి రోజు సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది. ఈ రైలుకు ప్రైమరీ మెయింటేనెన్స్ ఇప్పటి వరకు తిరుపతి ఉండగా దీనిని తిరువనంతపురం సెంట్రల్‌కు మార్చబోతున్నారు. అలానే సెకండరీ మెయింటేనెన్స్‌ని సికింద్రాబాద్‌కు మారుస్తున్నారు. ఈ కారణంగా కాలమాన పట్టికలో మార్పులు చేశారు.

మనం రోడ్డు వెంట నడుచుకుంటూ అలా వెళ్తుంటే పక్కనే దుకాణాల్లో.. పొంగిన పూరీలు, బోండాలు, ఫ్రైడ్ రైస్, మంచూరియా,సమోసాలు కనబడతాయి. వాటిని చూడగానే ఆకలి పుట్టుకొస్తుంది. కానీ, ఆ ఆహార పదార్థాలను ఎలాంటి నూనెతో తయారు చేశారో మనం తెలుసుకోలేం. మన శరీరాన్ని హరించే ఆహారాన్ని తీసుకుంటున్నామనే.. విషయాన్ని గుర్తించలేకపోతున్నాం.

నూనెలు సలసల ఆరోగ్యం విలవిల

- గుంటూరులో ఓ యువతి ఆహారం జీర్ణం కాలేదని జీజీహెచ్‌కు వెళ్లింది. వైద్య పరీక్షల అనంతరం స్ట్రీట్ ఫుడ్ తినడంతో ఆరోగ్య సమస్యలు వచ్చాయని వైద్యులు నిర్ధారించారు. కల్తీ నూనె, మసాలాలు, బేకరీ పదార్థాలు తీసుకోవడం తగ్గించాలని వైద్యులు సూచించారు.
- పెళ్లి రోజు అని.. ఓ ఉద్యోగి సహచరులతో కలిసి నగరంలో ఓ హోటల్‌కు వెళ్లారు. పలు రకాల ఆహార పదార్థాలు తిన్నారు. రెండవ రోజు వారు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి వెళ్లగా ఫుడ్ పాయిజన్ అయ్యిందని చెప్పారు.

- పదే పదే కాగుతున్న నూనెతో ఆరోగ్యానికి చేటు
- నిబంధనలు పట్టించుకోని హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు
- తనిఖీలు చేయని ఆహార నియంత్రణ అధికారులు



గుంటూరు(తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): రోజురోజుకి వంట నూనెల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ధరలతో హోటల్స్ నడపడం కష్టతరంగా మారుతోంది. దీంతో వ్యాపారులు లాజు, కల్తీ నూనెలను వాడటం మొదలు పెట్టారు. పైగా పదే పదే నూనెను వినియోగిస్తున్నారు. ఒక వైపు కల్తీ, మరో వైపు పదే పదే మరిగించడంతో ఆ నూనె విషపూరితంగా మారుతోంది. వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలు తిని ప్రజలు.. రోగాల బారిన పడుతున్నారు.

> పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో గతంలో ఆయిల్ మిల్లులపై అధికారులు దాడులు చేశారు. వంట నూనెల్లో 50 శాతానికి పైగా పత్తి నూనె కలుపుతున్నారనే విషయాన్ని గుర్తించారు. అధికారులు శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షలకు పంపారు.

● అన్ని సమయాల్లో....అదే నూనె

స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు ఆహార పదార్థాలను అన్ని వేళల్లో అందుబాటుల్లో ఉంచుతున్నారు. ఒక సారి పొయ్యిపై పాత్రలో పెట్టిన నూనె సాయంత్రం వరకు కాగుతూనే ఉంటోంది. ముఖ్యంగా మందు బాబులు అధికంగా మంసాహారాన్ని తీసుకుంటారు. దీంతో మద్యం కంటే కల్తీ నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు వారి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయనే విషయాన్ని మత్తులో గమనించలేకపోతున్నారు.


రోగాలు ఇలా వస్తాయి

ఒకసారి ఉపయోగించిన వంట నూనెను.. మళ్లీ వినియోగించడం ఆరోగ్యానికి చేటు కలిగిస్తుంది. మోతాదుకు మించి మరిగిన నూనెలో టీపీసీ(టోటల్ పోలార్ కౌంట్) 25 శాతానికి మించి ఉంటే శరీరానికి హానికరంగా మారుతుంది. అలాంటి నూనెతో ఆహార పదార్థాలు వండితే శరీరంలో అధికంగా ఫ్రీ రాడికల్స్ పెరిగిపోతాయి. నూనె రంగు, రుచి మారిపోతుంది. అడుగున నల్లటి పదార్థం తయారై ఆమ్లం అధికమవుతుంది. కొన్ని నూనెల నిల్వ ద్వారా విష పదార్థాలు ఏర్పడుతాయి. ఊబకాయం, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనత, బాలికల్లో సరైన సమయంలో పీరియడ్స్ రాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

తనిఖీలు ఎక్కడ?

ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్స్ స్ట్రీట్ ఫుడ్ దుకాణాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్నెల్లకు ఒకసారి కూడా తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవని రికార్డులు చెబుతున్నాయి. పండుగ, మీడియాలో కథనాలు వచ్చినప్పుడు.. తూతు మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో తనిఖీలు, అటుపై జేసీ ఆధ్వర్యంలో కేసులు విచారించి.. జరిమానాలు విధించేవారు. అవి ప్రస్తుతం కానరాకపోవడంతో.. కల్తీ యథేచ్ఛగా జరిగిపోతోంది. కబేళాలకు తరలించే పశువుల ఎముకల పిండిని కూడా నూనెలో కలుపేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



కల్తీ నూనె, ఇతర ఆహార పదార్థాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించి కల్తీపై సమాచారం ఇవ్వాలి. కల్తీ అని రుజువైతే జరిమానా, జైలుశిక్ష, ప్రవర్తన మార్చుకోకపోతే నగర బహిష్కరణ చేస్తాం.

-ఎన్.పూర్ణచంద్రరావు, జిల్లా జాయింట్ ఫుడ్ కంట్రోలర్, గుంటూరు

తెలుగు భాషను సుసంపన్నం చేసే సంస్కృతి రావాలి

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్



బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మీడియాలో తెలుగు భాషను సుసంపన్నం చేసే సంస్కృతి రావాలని.. దీని కోసం ప్రెస్ అకాడమి పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ తెలిపారు. బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని సన్నీ రిసార్ట్స్ ఆవరణంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల శిక్షణ తరగతులలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మీడియా రంగంలో వాస్తవాల్ని వక్రీకరించే విధానాలు ఉండరాదన్నారు. దీని కోసం ఒక నిర్మాణాత్మకమైన అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. చాలా సందర్భాలలో మీడియాలో వస్తున్న కొన్ని కథనాలు ప్రజల్ని పక్కదోవ పట్టించే విధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అన్నీ గ్రామీణ ప్రాంతాలలో విలేకరులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రెస్ అకాడమికి కొత్త ఒరవడిని తీసుకొచ్చేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. తెలుగుభాష కనుమరుగై పోతున్న పరిస్థితులలో దానిని పరిరక్షించే బాధ్యత ప్రెస్ అకాడమి తీసుకుంటుందన్నారు. తెలుగుభాషకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేయటంతోపాటు మీడియా రంగంలో తెలుగు బాషకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పత్రికా రంగం కత్తిమీద సాములాంటిదని తెలిపారు. సమాజంలో జరుగుతున్న ప్రజా సమస్యలపై పనిచేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. ప్రధానంగా క్రైమ్, రాజకీయ, మానవీయ కోణంలో రాసే కథనాలకు ప్రజాదరణ లభిస్తుందన్నారు. స్వయంగా సంఘటన స్థలాలకు వెళితే పూర్తి సమాచారంతో వార్తలు రాయటానికి అవకాశం ఉంటుందన్నారు. విషయపరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు అని ఆయన తెలిపారు.

ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్

- విద్యా సంస్థల పరిసర దుకాణాల్లో విస్తృత తనిఖీలు


విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల పరిసరాల్లో గంజాయి కట్టడికి ఈగల్ విభాగం నడుం బిగించింది. 'ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్' నినాదంతో విద్యా సంస్థల పరిసరాలను డ్రగ్స్ రహితంగా చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో.. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మార్గ నిర్దేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో మంగళవారం నుంచి ఈ నెల 12 వరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు ప్రారంభించారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు స్కూల్స్ కళాశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలు, బడ్డీ కొట్లు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పొగాకు ఉత్పత్తులు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. పాఠశాలలు, కాలేజీల సమీపంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం ప్రత్యేక దాడులు కొనసాగుతాయని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు నిల్వ చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యా సంస్థల పరిసర షాపుల యజమానులు తమ సామాజిక బాధ్యతను గుర్తించి.. "ఈ షాపులో సిగరెట్లు, మత్తు పదార్థాలు అమ్మబడవు" అనే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కాలేజీల యాజమాన్యం విద్యార్థుల నడవడికపై పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారినట్లు తెలిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి అవసరమైన మార్గదర్శనం అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ లక్ష్య సాధనలో పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమార్తె

- ఐదు గంటల్లో గుర్తించిన పోలీసులు
- కుటుంబసభ్యులకు అప్పగింత

నాగులుప్పలపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి అదృశ్యమైన బాలికను నాగులుప్పలపాడు పోలీసులు ఐదు గంటల్లో గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బి.నిడమానూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను ఆమె తల్లి సోమవారం రాత్రి మందలించారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున సదరు బాలిక ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా కుమార్తె ఆచూకీ కనిపించకపోవడంతో ఉదయం 8 గంటలకు ఎస్ఐ రజియాసుల్తానా దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎస్ఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సదరు బాలిక ఒంగోలు వెళ్లే బస్సు ఎక్కినట్లుగా తెలుసుకొని పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆమె ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎస్ఐ కేవలం ఐదు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ రజియాసుల్తానా, పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

రేషన్ దుకాణం సీజ్

- తరచూ ఫిర్యాదులపై అధికారులు దాడులు
- 300 కిలోల బియ్యం, 57 పంచదార ప్యాకెట్స్ అధికంగా ఉన్నట్లు గుర్తింపు



సరుకులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీ

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుడ్డు ప్రభాకరరావుకు చెందిన షాపు నెం.38ను మంగళవారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సీజ్ చేశారు. ఆ షాపుపై నిత్యం ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు చేశారు. దీంతో ఉండాల్సిన సరుకు కంటే 300 కిలోల బియ్యం, 57 ప్యాకెట్స్ పంచదార అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్‌డీలర్లు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆర్డీవో హెచ్చరించారు. అధికారులు వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

- 3232 సర్వీసులు తనిఖీలు



మాట్లాడుతున్న అధికారులు

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. 36 బృందాలుగా ఏర్పడి, 3232 సర్వీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 66 మందికి రూ.2.35 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సూపరిండెంట్ ఆంజనేయులు, విజిలెన్స్ డీఈ భాస్కర్, ఏడీ విజయ, డీఈ థామస్, వేటపాలెం ఏడీ శ్రీనివాసరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములకు పెరిగిన కౌలు వేలం

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం, సూరేపల్లి గ్రామాలలోని మూడు దేవాలయాలకు మంగళవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. గతం కంటే రెండు రెట్ల కౌలు ధర పెరిగిందని దేవదాయ శాఖ ఈవో కృష్ణారెడ్డి తెలిపారు, సోమేశ్వరస్వామికి చెందిన 5.60 సెంట్ల భూములకు గతంలో రూ. 17 వేలు కౌలుఉండగా ఇప్పుడు రూ.56 వేలకు రైతులు వేలంలో భూములను దక్కించుకొన్నారు. అలానే సూరేపల్లి గ్రామంలో వినాయక దేవాలయానికి చెందిన 1.75 సెంట్ల భూమికి గతంలో కౌలు రూ.8 వేలు ఉండగా ఇప్పుడు రూ.29 వేలకు రైతులు కౌలు వేలం పాట పాడారు. ముక్తిలింగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 2. 50 ఎకరాలకు గతంలో రూ.6 వేలు వేలం ఉండగా ఇప్పుడు రూ.7 వేలకు రైతులు పాట పాడారు. ఏడాది కాలానికి ఈ పాట అమలులో ఉంటుందని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

దంచి కొట్టిన వాన





ఒంగోలు నగరంలో మంగళవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. దాదాపు గంటన్నర సేపు విడవకుండా కురిసింది. దీంతోకాలువలు పొంగిప్రవహించాయి. జిల్లా అంతటా వర్షం కురిసింది. -ఆంధ్రజ్యోతి, ఒంగోలు

కలెక్టర్ బంగ్లా రోడ్డులో కూలిన భారీ చెట్టు

- తప్పిన పెనుప్రమాదం
- పాక్షికంగా దెబ్బతిన్న ఆటో

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రాకపోకలు జరిగిన స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద మంగళవారం మధ్యాహ్న సమయంలో పెద్దచెట్టు రోడ్డుపై పడిపోయింది. సాధారణంగా ఆ రోడ్డులో నిరంతరం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కారులు, ద్విచక్రవాహనాలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. ఆ చెట్ల కింద యాచకులు కూడా ఉంటుంటారు. అయితే ఒక్కసారిగా ఆ చెట్టు కిందపడిన సమయలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఓ ఆటో రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వైపు వస్తుండగా దాని చెట్టు పడటంతో అద్దాలు పగిలిపోయాయి. ఆటోలో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో దెబ్బతిన్న ఆటో

కాగా పడి పోయిన చెట్టును వెంటనే అక్కడి నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

కోలలపూడిలో 'సుపరిపాలనకు తొలిఅడుగు

మార్టూరు, జూలై8(ఆంధ్రజ్యోతి):పేద ప్రజలకు అన్నిరకాలుగా అండగా ఉండేది, వారికి మంచి చేసేది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా, ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి పనులను తెలియచేసేందుకు, రానున్న నాలుగేళ్లలో చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి, 'సుపరిపాలనకు తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి మంగళవారం రాత్రి మండలంలోని కోలలపూడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మమేకమయ్యారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ప్రజలకు అందిస్తున్న పెన్షన్లు, గ్యాస్ డబ్బులు, తల్లికి వందనం డబ్బులు సక్రమంగా చేరాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా ఆగస్టు 15వ తేదీ నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన హామీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులు నుంచి కొనుగోలు ధాన్యం రూ.1700 కోట్లు బకాయిలు పెట్టగా కూటమి ప్రభుత్వం ఈ బకాయిలను చెల్లించిందన్నారు. వ్యవసాయరంగంతో పాటు అన్ని రంగాలను నీరుగార్చిన జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు.పొగాకు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వమే పొగాకు కొనుగోలును ప్రారంభించిందన్నారు.ప్రతి రైతు పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రానున్న రోజులలో రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన యూనిఫామ్‌లతో విద్యార్థులు కనిపించగా వారితో కొంచెంసేపు ఎమ్మెల్యే ఏలూరి ముచ్చటించారు. అదేవిదంగా పలువురు గ్రామస్తులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాలని గ్రామనాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మాన్యం భూముల వేలం అడ్డగింత

- 15 ఏళ్లగా వసూలు కాని కౌలు బకాయిలు
- ప్రస్తుతం పాట నిర్వహించడంపై ప్రజల ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

దగ్గుబాడు/పర్చూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 15 ఏళ్లగా కౌలు బకాయిలు వసూలు చేయకుండా మళ్లీ వేలం నిర్వహించడం ఏమిటని గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కారంచేడు మండలం దగ్గుబాడులో మంగళవారం చెన్నకేశవ, వేణుగోపాలస్వామి, సిద్ధేశ్వర నాగవరపమ్మ స్వామివార్ల ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు. దేవాదాయశాఖ ఈవో శిరీష, ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తుండగా దగ్గుబాడు, పోతినవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామస్తులు వేలంపాట వద్దకు వచ్చి కౌలు వసూలు వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. తరువాత వివరాలు చెబుతామని ముందు కౌలు నిర్వహించే విధంగా సహకరించాలని అధికారులు కోరారు. ముందు వివరాలు చెప్పిన తరువాతనే కౌలు వేలం నిర్వహించాలని పట్టుపట్టారు. 15 ఏళ్లగా ఆలయ మాన్యం భూముల కౌలు చెల్లించకుండా బినామీ పేర్లతో వేలంలో పొలం దక్కించుకుంటూ సాగు చేస్తున్నా అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. పాత బకాయిలు వసూలు చేసిన తరువాత ఈఏడాదికి సంబంధించిన కౌలు వేలం నిర్వహించాలని స్పష్టం చేశారు. కొంత మంది అధికారులు కౌలుదారులతో కుమ్మక్కై కౌలు వసూలు చేయక పోవడంతోపాటు, ఆలయాలకు సంబంధించిన సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా వాడుకున్న ఈవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వేలం నిర్వహించే విధంగా సహకరించాలని అధికారులు కోరినా ససేమిరా అనటంతో కౌలు వేలం పాటను వాయిదా వేసినట్లు ఈవో శిరీష ప్రకటించారు. కౌలు బకాయి దార్ల అందరికీ నోటీసులు పంపాలని, తీసుకోని వారికి స్వయంగా అందజేయాలని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఈవోను ఆదేశించారు.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

(5వ పేజీ తరువాయి)

కమిటీలను నియమించింది. సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పంపిన పేర్లకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో ఈ నెల 30నే త్రిసభ్య కమిటీలు సొసైటీల బాధ్యతలు స్వీకరించనున్నాయి. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గాలనే 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. అయితే సభ్యుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. దీంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు త్రిసభ్య పాలనకు ప్రభుత్వం మొగ్గు చూపింది.

279 మందికి పదవులు..

ఒక్కో సొసైటీలో చైర్‌పర్సన్‌తో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ ప్రకారం మూడు జిల్లాల పరిధిలో తొలివిడతలో 279 మంది కూటమి నేతలను పదవులు వరించాయి. పల్నాడు జిల్లాలో 36 సొసైటీలకు నామినేటెడ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. గుంటూరు జిల్లా పరిధిలో 7, బాపట్ల జిల్లా పరిధిలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించింది.

నాడు నిర్వీర్యం..

సహకార రంగాన్ని వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. సహకార సంఘాల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యకర్తలను సభ్యులుగా చేర్చారు. దీంతో సొసైటీలు రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార రంగాన్ని ఆ పార్టీ నేతలు ఐదేళ్ల దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రూ.లక్షల్లో స్కాంలు జరిగినట్లు విచారణల్లో వెలుగుచూస్తున్నాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను నీరుగార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థికంగా కుదేలైంది. ఇదే పాలనను కూటమి ప్రభుత్వం కూడా అమల్లోకి తీసుకురావడంతో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి.

ప్రజా నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి



అద్దంకిలో నివాళి అర్పిస్తున్న హనిమిరెడ్డి, నాయకులు

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజానాయకుడని, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో వైఎస్ఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని గడియార స్తంభం కూడలిలో కేక్ కటింగ్ నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఏరియా వైద్యశాలలో రోగులకు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని పాత చీరాల గ్రామంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం మార్టూరులో వైసీపీ పార్టీనాయకులు నిర్వహించారు. మండల కాంప్లెక్స్ వద్ద వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భుక్యా సుమితాబాయి, కాకోలు రామారావు, కారచోల సులేమాన్, గడ్డం మస్తానవలి, బాబునాయక్, గడ్డం మస్తానవలి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: వైఎస్ఆర్ 76వ జయంతి సందర్భంగా స్థానిక ఎన్‌టీఆర్‌నగర్‌లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం శింగరకొండ రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలలో జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చినహనిమిరెడ్డి, స్థానికక నేతలు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- డీఎల్‌డీవో పద్మావతి



వివరాలు అడుగుతున్న డీఎల్‌డీవో

కారంచేడు(పర్చూరు), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు బలోపేతం చేసేందుకు చెత్తసంపద కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా డీఎల్‌డీవో పద్మావతి అన్నారు. మంగళవారం కారంచేడు మండలంలో డీఎల్‌డీవో పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై అధి కారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వ్యర్థ సేకరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తను ఎలా వేరుచేసి అందజేయాలని అన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానపంటలపై రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంకొల్లు,జూలై 8,(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఉద్యానపంటలను ప్రోత్సహించి రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. మండలంలోని గొల్లపాలెం, గంగవం, సూదివారిపాలెం గ్రామాలలో మంగళవారం ఉద్యానపంటల కింద డ్రాగాన్, నిమ్మ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో ముల్లియ్యా, టీడీపీ నాయకులు కరి శ్రీనివాసరావు, ఎస్సై సురేష్, తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అవీఇవీ

సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జులై 8 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్ వినియోగం, మిగులు ఆదాయానికి మార్గమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. ఎర్రగొండపాలెంలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.సోలార్ పలకల ఏర్పాటుకు రూ.2,22,222లక్షలు ఖర్చు అవుతుందని, దానికి రూ.7,800 ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌కు అయ్యే నికర ఖర్చు రూ.144,222 లక్షలు, మార్జిన్ అమౌంట్ రూ.22,222, బ్యాంకు రుణం రూ.1,22000 అని తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకు తక్కువ వడ్డీకే రుణం ఇస్తుందని, విద్యుత్ బిల్లులు చెల్లించనవసరం కూడా ఉండదని వివరించారు. ఇంటిపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుంటే 25ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ సౌకర్యాన్ని పొందవచ్చిని డీఈ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం ఏడీఈ సియానాయక్, ఏఈ అల్లూరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు శనగా నారాయణరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, బైపునేని మంత్రయ్య, కందుల నారాయణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



జమ్మనపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పేదవానికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని జమ్మనపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించి సన్నబియ్యంతో భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం నాణ్యమైనవి అందించేలా మంత్రి లోకేష్ పర్యవేక్షణలో జరుగుతోందన్నారు. ఈనెల 10న తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 580 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే తన సొంత నిధుల నుంచి రూ.లక్ష బహుమతిగా ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండుగలా మెగా పీటీఎంను నిర్వహించాలి

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ప్రైవేటు పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహిద్దామని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ కో చైర్మన్ పి.ప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలులో అసోసియేషన్ అధ్యక్షుడు జి.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యా సంస్కరణలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికివందనం ఇవ్వడం అభినందనీయమన్నారు. గడిచిన సంవత్సర కాలంలో విద్యారంగంలో అనేకమార్పులకు శ్రీకారంచుట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. అందువల్ల మెగా పీటీఎం సభకు తల్లిదండ్రులను ఆహ్వానించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాడెంట్లు పాల్గొన్నారు.

సర్వీసును రెగ్యులరైజేషన్ చేయాలి



మంత్రికి వివరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరణను ప్రారంభించాలని కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంగళవారం రాజధాని అమరావతిలో వారు మంత్రినికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం న్యాయ సలహాకోసం అడ్వకేట్ జనరల్ వద్ద ఉన్న దస్త్రాన్ని తెప్పించి ప్రక్రియను పునఃప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు గత ఏడాది మేనెల జీతం చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. ఆయా అంశాలపై మంత్రి లోకేష్ స్పందిస్తూ కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసు క్రమబద్ధీకరణ విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ కుమ్మరికుంట సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యం కోసం పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



నగదుసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):తమతో పదవతరగతి వరకు కలిసి చదివి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నూతలపాటి షడ్రక్ వైద్యం కోసం రూ.34 వేల నగదుసాయం అందించి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలో బి.ఆర్.పాలెం గ్రామానికి చెందిన షడ్రక్ 2001 -2002 విద్యాసంవత్సరంలో పదవతరగతి చదివాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మోకాలిచిప్ప రెండుగా చీలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చక్రవరం చినఅంజురాజు, ఒలేటి సత్యనారాయణ, బ్రహ్మయ్యలు తమతో కలసి చదివిన విద్యార్థుల నుండి రూ.34 వేల నగదు సేకరించి మంగళవారం షడ్రక్‌కు అందచేశారు.

రుణ సహకారంతో చక్కని జీవన ప్రమాణాలు

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు అందిస్తున్న రుణసాయంతో జీవన ప్రమాణాలను చక్కగా మెరుగు పరచుకోవచ్చని పీడీ శ్రీనివాస్, డీపీఎం రవికుమార్, ఎంపీడీవో రాజేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం అంజిబాబు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్సిడీ రుణాలపై చర్చించారు. గ్రామ సంఘాల పనితీరుపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సోలార్ రిజిస్ట్రేషన్‌లలో వేగం పెంచాలని వివరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.78 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, ఉన్నతి ఏపీఎం ఫణిబాబు, సీసీలు అనూరాధ, వీవోఏలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ అధికారులు, ప్రతినిధులు

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో మంగళవారం నూతన కార్యవర్గం ఎంపిక, ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రోటరీ మాజీ 3150 జిల్లా గవర్నర్ టీవీఆర్ మూర్తి హాజరయ్యారు. పోలియోపై పోరాటంలో క్లబ్ విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా 35 వేలు క్లబ్‌లు ఉండగా, 13 లక్షలు మంది సభ్యులు ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలో సమష్టిగా కృషి చేస్తూ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాట్నా యూనివర్సిటీలో ఐటీఐ చదువుతున్న భోగిరెడ్డి సంయుక్తకు రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జాలాది కృష్ణమూర్తి, లక్ష్మీప్రతాప్, బండారుపల్లి హేమంత్‌కుమార్, డా.ఐ.బాబురావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



చెక్కులు అందజేస్తున్న మంత్రులు రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి

అద్దంకి, జూలై8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో అద్దంకి నియోజకవర్గంలో 53 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్‌వోసీలను మంత్రులు రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళీలు అందజేశారు. మెప్మా మహిళలకు ట్యాబ్‌లను అందజేశారు. అద్దంకిలో టెంపరరీ ఎంవీఐ కార్యాలయం స్థానంలో పర్మినెంట్ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, వెలనాటి శ్రీనివాసరావు, దూళిపాళ్ల సుబ్బారావు, నాదెండ్ల సుబ్బారావు, కరి వేణు, రామకృష్ణ, దామా హనుమంతరావు తదితరులు మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్‌లకు వినతిపత్రాలు అందజేయగా సానుకూలంగా స్పందించారు. అమరావతిలో టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని మంత్రులకు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజల సమక్షంలో వారి సమస్యలు తెలుసుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక 2.0పై



మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ముఖ్యంగా శానిటేషన్ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలన్నారు. అలానే ప్రజా సమస్యలను గుర్తించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి వారికి అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. రోడ్ల వెంబడి చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో సుమతి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చు అని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బాలమురళిధర్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు పంటలసాగు సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. మొక్కజొన్న పంటకు ఎరువుల యాజమాన్యం అనేది దిగుబడిని పెంచడానికి చాలా ముఖ్యమన్నారు. నత్రజని, భాస్వరం పోటాష్ వంటి పోషకాలును సరైన మోతాదులో అందించడం ద్వారా ఎదుగుదల మెరుగుపరచవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఏవో పి. శ్రీనివాసరావు, ఏఈవో మౌలాలి, వీఏఏలు ప్రవీణ్, శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిత చిత్తు

- జోరుగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు



ప్రచారం నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల బారిన పడిన యువత భవిష్యత్తు ఛిన్నాభిన్నమవుతుందని, వాటికి దూరంగా ఉండి, ఉన్నతంగా రాణించాలని రూరల్ సీఐ శేషగిరిరావు, వన్‌టౌన్ సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేటపాలెంలో, చీరాల పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకర్షణ, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కూలీ నాలీ చేసి తల్లిదండ్రులు పిల్లల్ని చదివిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే పాఠశాల సమీపంలోని దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సిగరెట్స్, పాన్, గుట్కా, గంజాయి వంటి వాటిపై తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థల విక్రయాలు గమనిస్తే టోల్ ఫ్రీ నెం.1972కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జనార్ధన్, ఆయా స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కరిగిపోతున్న కొండలు

- బ్లాస్టింగ్ లలోనూ నిబంధనలు ఉల్లంఘనలు
- గ్రావెల్ కోసం అనుమతులు గోరంత... తవ్వకాలు కొండంత



గ్రావెల్ కోసం తవ్విన బల్లికురవ సమీపంలోని సనకొండ

అద్దంకి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ కోసం కొండలను ఇష్టారాజ్యంగా కరిగించేస్తున్నారు. అనుమతులు కొద్దిమేర తీసుకొని తవ్వకాలు మాత్రం కొండంత చేస్తున్నారు. అద్దంకి మండలంలోని ధర్మవరం, బల్లికురవ మండలంలోని బల్లికురవ సమీపంలోని సనకొండ, రామాంజనేయపురం వద్ద ఉన్న కొండ, సంతమాగులూరు మండలం ఏల్చూరు కొండ, పంగులూరు మండలం రామకూరు, కొండమంజులూరు సమీపం లోని కొండల నుంచి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దశాబ్దాల నుంచి తవ్వకాలు చేస్తుండంతో ఇప్పటికే పలు కొండలు ఆనవాళ్లు కూడా కోల్పోయాయి. అయితే అనుమతులు తీసుకునే సమయం లో రెండు, మూడు హెక్టార్లలోపే తీసుకొని తవ్వకాలు చేస్తున్నది మాత్రం అందిన కాడికి చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పదుల సంఖ్యలో క్రషర్లు ఉండడంతో నిత్యం పెద్దఎత్తున బ్లాస్టింగ్‌లు చేసి కొండలను పగుల గొడుతున్నారు. బ్లాస్టింగ్ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా జరుపుతున్నారు. దీంతో బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు సమీపంలో పంట పొలాలలో కూడా పడుతూ పంటలకు నష్టం వాటిల్లుతుంది. అదే సమయంలో పొలాలలో పనులు చేసుకునే రైతులు కూడా భయంభయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ చేయాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్లకు అలవాటు పడి మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. .అదేసమయంలో అనుమతు లకు మించి తవ్వకాలకు జరుగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొన్ని దశాబ్దాలలో పలు కొండల ఆనవాళ్లు పూర్తిగా కనుమరుగు అయినా ఆశ్చర్యం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతించిన మేర మాత్రమే తవ్వకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించి బ్లాస్టింగ్‌లు జరపకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



సొరంగంలా తవ్విన ధర్మవరం సమీపంలోని కొండ

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన

పట్టణంలోని రెండవవార్డులో పర్యటించిన ఎమ్మెల్యే కొండయ్య



మొక్కనాటుతున్న ఎమ్మెల్యేకొండయ్య అధికారులు

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని 2వ వార్డు పరిధిలో 575 కుటుంబాలు ఉండగా వారిలో 466 మందికి తల్లికి వందనం ద్వారా రూ.60.58 లక్షలు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని మంగళవారం ఈ వార్డులో నిర్వహించారు. వార్డు అంతటా పర్యటించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వార్డులో 258 మందికి గాను పెన్షన్ల ద్వారా ప్రతి నెల రూ.10.68 లక్షలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పీ4 ద్వారా 336 బంగారు కుటుంబాలు గుర్తించి వారి అభ్యున్నతికి 12 మంది మార్గదర్శకులను సిద్ధం చేసినట్లు వివరించారు. వీరిలో ఒక్కో మార్గదర్శకులు 15-20 మంది సభ్యులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అలాగే తాగునీరు. డ్రయిన్ సమస్యలపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అట్టహాసంగా జరుగుతుంటే జగన్‌రెడ్డి దుర్మార్గపు ప్రచారాలు చేస్తున్నట్లు చెప్పారు. జగన్ బూటకపు మాటలు జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. అలాగే మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్‌తో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

పండ్లతోటల పెంపకంతో తక్కువ ఖర్చు, అధికంగానే లాభార్జన సాగించవచ్చని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో రైతు సతీష్‌బాబుకు చెందిన పొలంలో డ్వామా పీడీ విజయలక్ష్మీతో కలిసి రైతు పొలంలో పండ్ల తోటల పెంపకం ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా పొలంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే లాంఛనంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు తోడ్పాటు అందించి తోటలు పెంపకాల అభివద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివన్నారాయణ, ఏపీవో దాసు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు తాగునీరు

ఖరీఫ్‌లో సాగుకు ఇబ్బంది లేకుండా నీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని తోటవారిపాలెం వద్ద ఉన్న పంట కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక శాతం చిన్న, సన్నకారు ప్రజలు రైతాంగంపై ఆధారపడి ఉన్నట్లు వివరించారు. వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. అలాగే కాలువలో తూటి కాడను పరిశీలించి, సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. ఆయన వెంట పలువురు టీడీపీ కూటమి నేతలు, రైతులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పంగులూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యకమం నిర్వహించారు. ఖరీఫ్‌లో వరి, మినుము, కంది సాగు చేపట్టే రైతులు ఈనెల 30వ తేదీలోగా పంటల బీమా పథకం ప్రీమియం చెల్లించాలని కోరారు. పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, జొన్న, పప్పుదాన్యాల సాగు చేపట్టాలన్నారు. కౌలు రైతులు గుర్తింపుకార్డులు పొందడం ద్వారా సాగు ప్రయోజనాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అలగ్జాండర్, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- రైతులు వినియోగించుకోవాలి : ఎంపీడీవో



తూర్పు కొప్పెరపాడులో సీతాఫలం మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా పండ్లతోటలు, కూరగాయల సాగుకు అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. ప్లాంటేషన్‌డే సందర్భంగా ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా తూర్పు కొప్పెరపాడు రైతు బత్తుల ధనలక్ష్మి పండ్లతోట సాగుకు సిద్ధం చేసిన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఎంపీడీవో స్వరూపారాణి సీతాఫలం మొక్కలు నాటి కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో పాలపర్తి శ్రీనివాసరావు 1.50 ఎకరాల్లో సీతాఫలం, కొండమంజులూరు గ్రామంలో రెండెకరాల విస్తీర్ణంలో గ్రామరైతు బొప్పూడి లింగారావు మామిడి మొక్కలు నాటినట్లు ఏపీవో సంతోషం తెలిపారు. పండ్లతోటల సాగుకు ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలు ఉపాధిహామీ పథకం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఎస్ఐ వినోద్‌బాబు హెచ్చరిక



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని ఎస్ఐ. వినోద్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రమైన పంగులూరు లోని జడ్పీ ఉన్నత పాఠశాల బాలబాలికలకు మంగళవారం ఫోన్ యాప్‌ల వినియోగం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా పిన్నవయస్సులో వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు విద్యార్థులు పాల్పడవద్దని సూచించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చదువు, క్రీడలపై దృష్టిసారించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహువార్షిక గ్రాసాలతో పాడిరైతులకు మేలు

బోయినవారిపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు, పాడి యజమానులు విధిగా గడ్డి మేతపై అవగాహన పొందడం వలన బహుళ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా పశుసవర్ధక శాఖ అధికారి డా. వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోయినవారిపాలెం పొలాల్లో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. రైతు తనకున్న భూమిలో నాలుగవ వంతు నీటి లభ్యత చర్యలు చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరక్టర్ డా.చిట్టిబాబు, డా.పావని, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

అద్దంకి, జూలై8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలోని 9 సొసైటీలకు పర్సన్‌ఇన్‌చార్జులను, సభ్యులను(త్రిమెన్ కమిటీ) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గోవాడ సొసైటీ చైర్‌పర్సన్‌గా భైరపునేని వెంకటసత్యనారాయణ, సభ్యులుగా మన్నెం బ్రహ్మయ్య, కందిమళ్ల వెంకట్రావు, మణికేశ్వరం సొసైటీ చైర్‌పర్సన్‌గా నర్రా బ్రహ్మానందం, సభ్యులుగా షేక్ మస్తాన్‌వలి, వెలనాటి వీరరాఘవయ్య, వల్లాపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా మాలపాటి వెంకటసుబ్బయ్య, సభ్యులుగా మందా యాకోబు, షేక్ ఖాజా వలి, జాగర్లమూడివారిపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా అల్లంనేని బ్రహ్మానందస్వామి, సభ్యులుగా దూళిపాళ్ల ప్రసన్నాంజనేయులు, మట్టకొయ్య బ్రహ్మయ్య, రావినూతల సొసైటీ చైర్‌పర్సన్‌గా పూనాటి వెంకటరావు, సభ్యులు గా నాదెండ్ల తిరుపతిరావు,తిమ్మనపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా మొరవనేని రమేష్‌బాబు, సభ్యులుగా పల్లెపోతుల శ్రీరాములు, మన్నె ఫణీంద్ర, కొమ్మాలపాడు సొసైటీ చైర్‌పర్సన్‌గా షేక్ చెన్నుపల్లి సుభాని, సభ్యులుగా గడె హనుమంతరావు, కొప్పాక ఏడుకొండలు, కుందుర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా కొప్పాక ఏడుకొండలు, సభ్యులుగా నిడమానూరి నరసింహరావు, కొండేటి శ్రీనివాసరావు, సంతమాగులూరు సొసైటీ చైర్‌పర్సన్ గా అట్లా పెద వెంకటరెడ్డి, సభ్యులుగా ధూళిపాళ్ల చలపతి, చల్లా ఏడుకొండలును నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చినగంజాం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.సిరివెన్నల, చీరాల సబ్ యూనిట్ అధికారి పి.శ్రీనివాసరావులు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది జాతీయ డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా చినగంజాం గ్రామంలో డెంగ్యూ వ్యాధులపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తదనంతరం పీహెచ్‌సీ ఆవరణలో జరిగిప సభలో వైద్యాధికారి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వినియోగించాలన్నారు. మలేరియా, డెంగ్యూ లక్షణాలు కనబడిన వెంటనే వైద్యశాలకు వచ్చి చికిత్స తీసుకొని పక్షంలో ప్రమాదాలు ఏర్పడతాయని తెలిపారు. ఫ్రైడే డ్రైడే రోజు పరిసరాల పరిశుభ్రత , ఇంటి లోపల, వెలుపల దోమలు పెరిగే ప్రదేశాలను, కొబ్బరి బోండాలు, , పాత కూలర్లు, గుంతలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ అధికారి తెలిపారు. నీటిలో నిల్వ ఉన్న దోమల లార్వాలను గుర్తించి ఎబెట్ ద్రవంతో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, టీ.హెచ్.ఎస్ స్వర్ణలత, హెచ్‌వీ ఉల్దారాణి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటి హెల్త్ అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలురైతులు గుర్తింపు కార్డులను తీసుకోవాలి

యద్దనపూడి,(మార్టూరు)జూలై8(ఆంధ్రజ్యోతి):కౌలుదారులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలంటే తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డులను తీసుకోవాలని ఏవో కుమారి అన్నారు.మంగళవారం యద్దనపూడి మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో కుమారి మాట్లాడుతూ ఎకరాకు రూ.1900 వంతున పత్తిపంటను సాగుచేస్తున్న రైతులు ఈ నెల 15 వతేదీలోపు పంటలబీమాను చెల్లించాలన్నారు. త ద్వారా పత్తిపంట సాగులో రైతు నష్టానికి గురైతే ఎకరాకు రూ.38 వేలు బీమా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నల్లపనేని రంగయ్యచౌదరి, ఎంపీటీసీ సభ్యుడు గొట్టిపాటి సతీష్, వీఏఏలు ఏసుబాబు,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'

చినగంజాం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి ఎస్ఐ శీలం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాల మీద రాష్ట్ర ఈగల్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వందమీటర్ల దూరంలో ఉన్న షాపులను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. షాపుల్లో పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్ధలకు సంబంధించిన వాటిని అమ్ముతున్నారేమోనని పరిశీలించారు. పాఠశాలకు వంద మీటర్ల దూరంలో ఉన్న షాపులలో మత్తు పదార్థలు, పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి.ప్రకాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై ర్యాలీ

యద్దనపూడి,(మార్టూరు)జూలై8(ఆంధ్రజ్యోతి):డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా మంగళవారం యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ లో వైద్యాధికారి శ్రీహర్ష మాట్లాడుతూ నివాసగృహాల వద్ద దోమలు అభివృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై అందరూ అవగాహనతో మెలగాలన్నారు. వ్యాధి లక్షణాలను ఆయన వివరించారు. వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో డాక్టరు వేణుబాబు,డాక్టరు నవీన, హెల్త్ అసిస్టెంట్ ఇండేల సింగారెడ్డి, ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడులో ముంచుకొస్తున్న నీటిఎద్దడి

- ఎండిపోయిన జయప్రకాష్ నారాయణ్ చెరువు
- అరకొరగా లైబ్రరీ చెరువు
- మూడురోజులకు ఒకసారి సరఫరా



ఎండిపోయిన జయప్రకాష్ నారాయణ్ చెరువు

కారంచేడు (పర్చూరు), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కొమ్మమూరు కాలువలో నీటి సరఫరా ఉన్న సమయంలో చెరువులను పూర్తిస్థాయిలో నింపడంలో వైఫల్యం కారణంగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే పేరొందిన కారంచేడు గ్రామ ప్రజలకు నీటిసరఫరా సక్రమంగా జరగక తీవ్రంగా ఇబ్బంది పడుతు న్నారు. ఈ గ్రామంలో 14వేల పైచిలుకు జనాభాతోపాటు, పదిహేను వందలకు పైగా పశువులు ఉన్నాయి. గ్రామంలో ప్రస్తుతం ఉన్న రెండు మంచినీటి చెరువులకు గాను ఒక చెరువు పూర్తిగా ఎండిపోగా, మరో చెరువులో నీరు అడుగంటాయి. దీంతో నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. కూతవేటు దూరంలో కొమ్మమూరు కాలువ ఉన్న అధికా రుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు దశాబ్దాల క్రితం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో భారీ విస్తీర్ణంలో జయప్రకాష్ నారాయణ్ చెరువును అభివృద్ధి చేశారు. కొమ్మమూరు కాలువ నుంచి నీటిని నింపేలా పైపులైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు నీటి సరఫరా చేసేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌నూ నిర్మించారు. ఈ వేసవికి ముందు ఈ చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నింపుకోక పోవడంతో ప్రస్తుతం నీటికి కటకటలాడాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతు న్నారు. జయప్రకాష్ నారాయణ్ చెరువు పూర్తిగా ఎండిపోయింది. గ్రామంలోని మరో లైబ్రరీ చెరువులో నీరు అరాకొరాగానే ఉంది. ప్రస్తుతం అందులో ఉన్న నీటిని రెండు మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన పరిస్థితి నెలకొంది. పైపులైన్‌కు లీకులు పడడంతో అరాకొరా నీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొమ్మమూరు కాలువలో అరాకొరా నీరు ఉండడం, ప్రస్తుతం ఉన్న నీటి పరిమాణం దృష్ట్యా చెరువులకు నీరు నింపలేని పరిస్థితి. కేవలం మూడు మాసాలు మినహా కొమ్మమూరు కాలువ ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. పంచాయతీ వైఫల్యంతో కొద్దికాలం అవసరాలకు సరిపడ నీటిని నిల్వచేసి సరఫరా చేయడంలో ప్రస్తుతం చెరువులు ఒట్టిపోయాయి. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరైన కార్యాచరణ రూపొందించి ఇలాంటి పరిస్థితులు పునావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువులో నీటి సరఫరా లేక పరిస్థితి ఇలా